E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం


@ekaburu.com

(తేదీ) 31-05-2025 (వారం) శనివారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com



శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద
» 2లో

# కోడెల మృత్యుఘోష



- రాజన్న గోశాలలో కోడెలు
వేములవాడ రాజన్న గోశాలల్లో కోడెల మృత్యుఘోష
- సామర్థ్యానికి 3 రెట్ల మేర గోశాలల్లో కుక్కుతుండటంతో తొక్కిసలాటలు, అంటురోగాలు
- భారీగా చనిపోతున్న మూగజీవాలు.. పూడ్చి చేతులు దులుపుకుంటున్న సిబ్బంది
- చోద్యం చూస్తున్న దేవాదాయశాఖ మంత్రి కార్యాలయం

పకడ్బందీ వితరణ విధానం లేక అభాసుపాలవుతున్న దేవాదాయశాఖ

ఈ కబురు, హైదరాబాద్: భక్తులు దేవుడికి సమర్పించిన కోడెలను సంరక్షించాల్సిన దేవాదాయ శాఖ వాటికి మరణశాసనం లిఖిస్తోంది. కొందరు అధికారుల నిర్లక్ష్యం, చేతివాటం ఫలితంగా కొన్ని రోజులుగా రోజుకు 8 నుంచి 10 కోడెలు ప్రాణాలు వదులుతున్నాయి. దీనిపై ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో స్థానిక యంత్రాంగం చేతులెత్తేసింది. చనిపోయిన కోడెలను ఖననం చేయటం తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేకపోతోంది.

**భక్తుల ఆనవాయితీని సొమ్ము చేసుకుంటూ..**

మరే దేవాలయంలో లేని ఓ ఆనవాయితీ వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో ఉంది. కోరికలు నెరవేరిన భక్తులు దేవుడి మొక్కు కింద కోడె (ఎద్దు)లను ఆలయానికి సమర్పించడం ఏళ్లుగా కొనసాగుతోంది. ఇలా పొందిన కోడెల సంరక్షణకు ఆలయం రెండు గోశాలలను నిర్వహిస్తోంది. గతంలో కోడెలను వేలం ద్వారా తిరిగి అమ్మే పద్ధతి ఉండేది. భక్తులు సమర్పించిన వాటిని విక్రయించడం, కొందరు కొని వాటిని కబేళాలకు తరలిస్తుండటం తీవ్ర విమర్శలకు కారణమైంది. దీంతో వేలం ప్రక్రియను నిలిపేసి వాటిని సంరక్షించే గోశాలలకు, వ్యవసాయ పనులు చేసుకొనే రైతులకు ఉచితంగా ఇచ్చే పద్ధతి ప్రారంభమైంది. కానీ దీని అమలుకు పక్కా విధానం లేకుండా పోయింది. గోశాలలు, రైతుల పేరు చెప్పి కొందరు వాటిని చేజిక్కించుకొని అమ్ముకుంటున్నారు. ఈ విషయంలో దేవాదాయ శాఖ ఉద్యోగులు కూడా కమీషన్లకు అలవాటుపడి వారికి సహకరిస్తున్నారన్న ఆరోపణ ఉంది. అలా వెళ్లే కోడెల పరిస్థితి ఏమిటో పరిశీలించే విధానం లేదు. కబేళాలకు అమ్మేందుకు కోడెలను తీసుకెళ్తున్న వారి వివరాలు తెలిసి కూడా దేవాదాయశాఖలోని కొందరు సిబ్బంది కాసుల కోసం వాటిని అప్పగించేస్తున్నారు.

**అక్రమాలకు బ్రేక్ పడినా..**

గతేడాది ఆగస్టులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తమకు గోశాల ఉందని.. వేములవాడ ఆలయ గోశాల నుంచి గోవులు ఇస్తే పోషించుకుంటామంటూ దేవాదాయశాఖ మంత్రి కార్యాలయానికి అర్జీ పెట్టుకున్నాడు. దాన్ని పరిశీలించాలంటూ మంత్రి కార్యాలయం ఆ అర్జీని వేములవాడ దేవాలయ అధికారులకు పంపింది. ఆ వ్యక్తి ఏకంగా 60 కోడెలు, గోవులు అడగ్గా అధికారులు అభ్యంతరం చెప్పారు.

తరువాయి 2లో

# అణు బాంబులకు భయపడం



*'ఆపరేషన్ సిందూర్.. దేశ రక్షణ వ్యవస్థ ఎంత బలంగా ఉందో ప్రపంచానికి తెలిసేలా చేసింది. బ్రహ్మోస్ క్షిపణి తరహా రక్షణ వ్యవస్థ కల్గిన మనదేశ సామర్థ్యంతో పాక్ ను చావుదెబ్బ కొట్టాం. ఉగ్రవాదాన్ని అంతం చేసే లక్ష్యంతో చేపట్టిన ఈ ఆపరేషన్ సిందూర్.. పాకిస్తాన్ మూలాల్లోకి పోయి మరీ విధ్వంసం సృష్టించాం. ...... ప్రధానంగా బ్రహ్మోస్ క్షిపణి ప్రయోగంతో పాక్ కు ఊపిరి సలపలేదు.*

ఈ కబురు,కాన్పూర్: ఆపరేషన్ సిందూర్ తో పాకిస్తాన్ కు వణుకు పుట్టించిన విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి గుర్తు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. భారత్ చేపట్టిన ఈ ఆపరేషన్ సిందూర్ తో పాకిస్తాన్ నిద్రలేని రాత్రులు ఎలా ఉంటాయో చూపెట్టామన్నారు మోదీ. ఈ రోజు(శుక్రవారం) యూపీలోని కాన్పూర్ పర్యటనలో భాగంగా మోదీ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇది భారత్ దేశ శత్రువులకు ఒక హెచ్చరిక లాంటిది.




» 4లో

# చైనా త్రీ గోర్జెస్ డ్యామ్‌కు సమానమైన ఇంజినీరింగ్ అద్భుతం కాళేశ్వరం: కేటీఆర్



**దృఢ నాయకత్వం, ప్రజల జీవితాలను మార్చాలన్న చిత్తశుద్ధి ఉంటే అద్భుతమైన ప్రగతి సాధ్యమని తెలంగాణ రాష్ట్రం నిరూపించిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు.**

ఈ కబురు,హైదరాబాద్: దృఢ నాయకత్వం, ప్రజల జీవితాలను మర్చాలన్న చిత్తశుద్ధి ఉంటే అద్భుతమైన ప్రగతి సాధ్యమని తెలంగాణ రాష్ట్రం నిరూపించిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తొమ్మిదేళ్ల భారాస పాలనలో తెలంగాణ సాధించిన విజయాలు దేశానికే కాదు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సంపద సృష్టించడంతో పాటు సమాజంలోని అట్టడుగు వర్గాలకు సమానంగా పంచడమే తమ హయాంలో తెలంగాణను దేశంలోనే ప్రత్యేకంగా నిలిపిందని వివరించారు. లండన్‌లో జరుగుతున్న బ్రిడ్జ్ ఇండియా వీక్ 2025 సదస్సులో.. 'స్థిరమైన వృద్ధితో ప్రపంచ ఆర్థిక రంగాన్ని నడిపించడంలో తెలంగాణ ఎందుకు ముఖ్యం?' అనే అంశంపై కేటీఆర్ ప్రధాన ఉపన్యాసం ఇచ్చారు.

తరువాయి 2లో


» 6లో



# బీజేపీతో పొత్తుపెట్టుకున్న ఏ పార్టీ బాగుపడలేదు : ఎమ్మెల్సీ కవిత



*ఈ కబురు,మంచిర్యాల: నాకంటూ సొంత అజెండా ఏమీలేదు. పార్టీని కాపాడుకోవాలనేది నా తపన అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మరోసారి స్పష్టం చేశారు.*
» 2లో

# ఈటల, హరీశ్‌రావు ఇద్దరూ కలిసి .. కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడారు: మహేశ్‌కుమార్‌గౌడ్



సర్జికల్ స్ట్రయిక్స్ చేసి గొప్పలు చెప్పుకొంటున్నారు.. అప్పట్లో ఇందిరా గాంధీ వందల కొద్దీ సర్జికల్ స్ట్రయిక్స్ చేసినా ఏనాడూ చెప్పుకోలేదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.
» 2లో


» 5లో



# పారిశ్రామికవేత్తల ద్వారానే సంపద సృష్టి సాధ్యం: సీఎం చంద్రబాబు



**సంపద సృష్టి జరగకపోతే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేమని.. సంపద సృష్టి పారిశ్రామికవేత్తల ద్వారానే సాధ్యమవుతుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు.**

ఈ కబురు,దిల్లీ: సంపద సృష్టి జరగకపోతే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేమని.. సంపద సృష్టి పారిశ్రామికవేత్తల ద్వారానే సాధ్యమవుతుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రభుత్వ విధానాలు, ఏపీలో అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలను వివరించారు. సంపద సృష్టిలో ఏపీకి పారిశ్రామిక వేత్తలు సహకరించాలని కోరారు. పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశగతిని మార్చేశాయన్నారు. 1990లో ఇంటర్‌నెట్ విప్లవం వచ్చిందని, దాన్ని ముందుగా అందుకున్న వాళ్లలో తానూ ఒకడినని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌కు జనాభా అనుకూలత ఉందన్న చంద్రబాబు.. డెమోగ్రాఫిక్ డివిడెండ్‌ను భారత్ సరిగ్గా ఉపయోగించుకోవాలన్నారు.

తరువాయి 3లో


» 4లో



# సుంకాలపై మళ్లీ ట్రంప్‌దే పైచేయి.. మరో కోర్టులో అనుకూల తీర్పు



**అమెరికా ప్రభుత్వం విధించిన సుంకాల అమలును నిలిపివేస్తూ ట్రేడ్ కోర్టు ఇచ్చిన తీర్పును మరో న్యాయస్థానం నిలిపివేసింది.**

ఈ కబురు: ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై భారీస్థాయిలో సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు ట్రేడ్ కోర్టులో ఎదురుదెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సుంకాల విధింపునకు యూఎస్‌లోని మరో కోర్టు అనుమతించింది . ట్రంప్ ప్రభుత్వం విధించిన సుంకాలు అమలుకాకుండా ట్రేడ్ కోర్టు నిలుపుదల చేసింది. దీనిపై ట్రంప్ సర్కారు అప్పీల్ దాఖలు చేసింది. గురువారం (స్థానిక కాలమానం ప్రకారం) విచారణ జరిపిన న్యాయస్థానం..

తరువాయి 2లో



## మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ వ్యవహారం..... తెలంగాణ ప్రభుత్వ కీలక ప్రకటన

ఈ కబురు, హైదరాబాద్: మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ సంచలన ఆరోపణల వ్యవహారంపై విచారణ ముగిసిందని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.
» 3లో

# 2014- 2023 సినిమాలకు గద్దర్ అవార్డులు.. ఉత్తమ చిత్రాలివే!

*2014-2023 సంవత్సరాల్లో విడుదలైన సినిమాలకు సంబంధించి గద్దర్ అవార్డుల వివరాలను మురళీమోహన్ ప్రెస్‌మీట్‌లో వెల్లడించారు.*

*ఈ కబురు: తెలంగాణ ప్రభుత్వం అందించనున్న గద్దర్ అవార్డులపై ప్రముఖ సినీనటుడు, జ్యూరీ ఛైర్మన్ మురళీమోహన్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 2014 నుంచి 2023 వరకు విడుదలైన సినిమాలకు గద్దర్ అవార్డులను ప్రకటించారు. ఏడాదికి మూడు చిత్రాల చొప్పున ఉత్తమ సినిమాలకు అవార్డులను వెల్లడించారు. 2014 జూన్ 2 నుంచి సెన్సార్ అయిన సినిమాలను పరిగణనలోకి తీసుకున్నట్లు చెప్పారు. వీటితోపాటు సినీ రంగానికి సేవలు అందించిన వారికి ఆరు ప్రత్యేక అవార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజాకవి, దివంగత కాళోజీకి స్పెషల్ జ్యూరీ అవార్డును ప్రకటించారు.*

తరువాయి 3లో





## ఇందిరమ్మ ఇళ్లకు 2.10లక్షల లబ్ధిదారులు ఎంపిక: పొంగులేటి

ఇందిరమ్మ ఇళ్లకు ఇప్పటి వరకు 2.10లక్షల మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.
» 2లో

## విద్యార్థి వీసా.. స్లాట్ల కోసం రోజూ చెక్ చేసుకోండి అమెరికా సూచన

» 3లో





## పసలేని ఆరోపణలపై స్పందించను

భాజపాలో భారాస విలీనానికి ప్రయత్నం జరుగుతున్నట్లు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు.
» 3లో


# ప్రపంచ సుందరి 2025 ఎవరో?

ప్రపంచ సుందరి-2025 ఎవరో తేలే సమయం ఆసన్నమైంది. విశిష్ట అతిథులు.. బాలీవుడ్ తారల ప్రదర్శనల నడుమ హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా శనివారం మిస్‌వరల్డ్ పోటీల ఫైనల్ జరగనుంది. కిరీటాన్ని సొంతం చేసుకునేందుకు 108 దేశాల అందాలభామలు పోటీపడుతున్నారు.
» 3లో



మొదటి పేజీ తరువాయి

## శ్రీశైలం జలాశయానికి కొనసాగుతున్న వరద



**ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది.**

**ఈ కబురు,సున్నిపెంట సర్కిల్: ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల ప్రాజెక్టు నుంచి 88,835 క్యూసెక్కులు, సుంకేశుల జలాశయం నుంచి 8,824 క్యూసెక్కుల వరద వస్తోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం శుక్రవారం ఉదయం 6 గంటల సమయానికి 818.20 అడుగులుగా ఉంది. నీటి నిల్వ 39.5529 టీఎంసీలుగా నమోదైంది.**

మొదటి పేజీ తరువాయి

# కోడెల మృత్యుఘోష



కానీ మంత్రి కార్యాలయం ఆదేశించడంతో ఇవ్వక తప్పలేదు. అలా పొందిన మూగజీవాల్లో చాలా వాటిని ఆ వ్యక్తి అమ్మేసుకున్నాడని ఆ తర్వాత అధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై పోలీసు కేసు నమోదవగా, విచారణలో అది నిజమేనని తేలింది. అప్పట్లో ఇది సంచలనం కావడంతో కోడెల వితరణను జిల్లా కలెక్టర్ నిలిపివేయించారు. పంపిణీకి కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఉండటంతో ఆయన చర్యలు తీసుకున్నారు.

అనారోగ్యం.. ఆపై తొక్కిసలాటలు..

కోడెల వితరణ నిలిచిపోవడం, మొక్కుల రూపంలో కోడెలు వస్తుండటంతో ఆలయ గోశాలలు కోడెలతో కిక్కిరిసిపోయాయి. ప్రస్తుతం గోశాలల్లో 1,250కిపైగా కోడెలు ఉన్నట్లు సమాచారం. ఉండాల్సిన వాటికంటే మూడు రెట్లు ఎక్కువ గా ఉండటంతో గోశాలల్లో వాటికి తిరిగే చోటు కూడా లేదు. పైగా కనీస వసతులు కూడా లేకపోవడం, వర్షాలు కురుస్తుండటంతో గోశాలలు రొచ్చురొచ్చుగా మారిపోయాయి.

రోజుల తరబడి బురద ఉండటంతో గిట్టల దగ్గర నుంచి ఇన్ఫెక్షన్ సోకి చాలా కోడెలు అనారోగ్యానికి గురవుతున్నాయి. మరోవైపు తొక్కిసలాట కూడా జరుగుతోంది. ఫలితంగా నిత్యం కోడెలు చిపోతున్నాయి. వాటిని ట్రాక్టర్లలో తీసుకెళ్లి గోతులు తవ్వి గుట్టుచప్పుడు కాకుండా పూడ్చేసి సిబ్బంది చేతులు దులుపుకొంటున్నారు. ఇంత జరుగుతున్నా దేవాదాయశాఖ మంత్రి కార్యాలయం కిమ్మనడం లేదు. విషయాన్ని ఆలయ అధికారులు కమిషనర్ కార్యాలయానికి చేరవేశారు. కానీ మంత్రి కార్యాలయమే నిర్లక్ష్యంగా ఉండటంతో కమిషనరేట్ కూడా మౌనందాల్చింది.

ఒక్కరోజే 8 కోడెలు మృత్యువాత

వేములవాడ అర్బన్: వేములవాడ రాజన్నకు చెందిన 8 కోడెలు శుక్రవారం మృత్యువాత పడ్డాయి. అధికారులు గుట్టుచప్పుడు కాకుండా మూలవాగులో వాటిని ఖననం చేశారు. శ్రీ రాజరాజేశ్వరస్వామికి భక్తులు సమర్పించే కోడెలను తిప్పాపూర్‌లోని గోశాలలో సంరక్షిస్తున్నారు. ఈ గోశాలలో పరిమితికి మించి కోడెలు ఉండటంతో తొక్కిసలాట జరిగి చనిపోతున్నాయని ఆరోపణలున్నాయి.

ఏటా కోడె మొక్కులతో రాజన్న ఆలయానికి దాదాపు రూ. 22 కోట్లకుపైగా ఆదాయం వస్తున్నా వాటి సంరక్షణపై ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. వసతులు సరిగ్గా లేక చిన్నపాటి వర్షానికే గోశాల బురదగా మారి కోడెలు అనారోగ్యం పాలవుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఆలయ అధికారులు కోడెల సంరక్షణపై నిర్లక్ష్యం చేయకుండా వసతులు కల్పించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

మొదటి పేజీ తరువాయి

# అణు బాంబులకు భయపడం

ఈ కబురు,కాన్పూర్: ఆపరేషన్ సిందూర్ తో పాకిస్తాన్ కు వణుకు పుట్టించిన విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి గుర్తు చేశారు. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ను విజయవంతంగా పూర్తి చేశామన్నారు. భారత్ చేపట్టిన ఈ ఆపరేషన్ సిందూర్ తో పాకిస్తాన్ నిద్రలేని రాత్రులు ఎలా ఉంటాయో చూపెట్టామన్నారు మోదీ. ఈ రోజు (శుక్రవారం) యూపీలోని కాన్పూర్ పర్యటనలో భాగంగా మోదీ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఇది భారత్ దేశ శత్రువులకు ఒక హెచ్చరిక లాంటిది. మమ్మల్ని తక్కువ అంచనా వేసే వారికి కూడా ఇది ఒక గుణపాఠం. ఆపరేషన్ సిందూర్ అనేది ఒక ఆరంభం మాత్రమే.. ఇది ఇంకా ముగిసిపోలేదు. దీన్ని మరిచిపోవద్దు' అంటూ ప్రధాని మోదీ హెచ్చరించారు. పాకిస్తాన్ పాత కాలంలో రాష్ట్ర, రాష్ట్రేతర సంస్థల మధ్య తేడాను చూపించే ఆట ఇకపై పనిచేయదు' అని మోదీ క్లియర్ మెసేజ్ ఇచ్చారు.ఉగ్రవాదం ఒక విష సర్పమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అది మరోసారి మనవైపు తల ఎత్తి చూస్తే, కలుగులోంచి బయటకు లాగి, కాలితో నలిపి చంపేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. పహల్గాం ఉగ్రవాద దాడి వెనుక ఉన్న కుట్రదారుల స్థావరాలను మన సైనిక దళాలు శిథిలాలుగా మార్చేశాయని చెప్పారు. మన అమ్ములపొదిలో ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక బాణం అని తెలిపారు. ఉగ్రవాదంపై పోరాటం ఆగదని, ఆపే ప్రసక్తే లేదని పునరుద్ఘాటించారు. శుక్రవారం బిహార్‌లోని కరాకాట్ పట్టణంలో రూ.48,520 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో రూ.47,600 కోట్ల విలువైన 15 మెగా అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు సర్టిఫికెట్లు, చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా రెండుచోట్లా బహిరంగ సభల్లో ప్రసంగించారు. గత నెలలో పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన మరుసటి రోజే బిహార్‌లోని మధుబని జిల్లాలో పర్యటించానని, ముష్కరులను కలలో కూడా ఊహించలేని రీతిలో శిక్షిస్తానంటూ ప్రజలకు మాట ఇచ్చానని గుర్తుచేశారు. ఆ మాట నిలబెట్టుకొని, మళ్లీ బిహార్‌లో అడుగు పెట్టానని పేర్కొన్నారు. మన ఆడబిడ్డలు ధరించే సిందూరం శక్తి ఏమిటో పాకిస్తాన్‌తోపాటు మొత్తం ప్రపంచం చూసిందన్నారు. ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారంటే...

''పాకిస్తాన్ సైన్యం రక్షణలో భద్రంగా ఉన్నట్లు ఉగ్రవాదులు భావించేవారు. కానీ, వారిపై దాడిచేసి మోకాళ్లపై నిలబెట్టాం. పాకిస్తాన్ వైమానిక స్థావరాలు, సైనిక కేంద్రాలను ధ్వంసం చేశాం. ఇది నవ భారతం. మన శక్తి ఏమిటో అందరికీ తెలుస్తోంది. ఉగ్రవాదులకు మరింత బాగా అర్థమవుతోంది. దేశ రక్షణ కోసం సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి. బిహార్‌లోని సరన్ జిల్లాకు చెందిన బీఎస్ఎఫ్ ఎస్ఐ మొహమ్మద్ ఇంతియాజ్ జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులపై పోరాడుతూ అమరుడయ్యాడు. బీఎస్ఎఫ్ జవాన్లు దేశమాత సేవలో తరిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో స్వదేశీ ఆయుధ బలాన్ని, మేక్ ఇన్ ఇండియా శక్తిని ప్రదర్శించాం. బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్తాన్ భూభాగంలోకి ప్రవేశించి, విధ్వంసం సృష్టించాయి.

మనం కొడుతున్న దెబ్బలు తట్టుకోలేక యుద్ధం ఆపాలంటూ పాకిస్తాన్ వేడుకుంది. ఆపరేషన్ సిందూర్ ముగియలేదు. అణు బాంబులకు భారత్ భయపడదు. శత్రువుల వద్దనున్న అణ్వాయుధాలను బట్టి నిర్ణయాలు తీసుకొనే రోజులు పోయాయి. ఉగ్రవాదాన్ని అంతం చేసే విషయంలో మన సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. ముష్కరులపై ఎప్పుడు, ఎక్కడ, ఎలా దాడి చేయాలో సైనికులే నిర్ణయించుకుంటారు. ఉగ్రవాదులను, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ప్రభుత్వాలను ఇకపై ఒక్కటిగానే పరిగణిస్తాం.

మావోయిజం అంతమయ్యే రోజు దగ్గర్లోనే..

దేశానికి శత్రువులైన వారందరిపైనా మన పోరాటం కొనసాగుతోంది. వారి సరిహద్దులో ఉండొచ్చు లేదా దేశం నడి□గొడ్డున ఉండొచ్చు. హింస, అశాంతిని ప్రేరేపించే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. గతంలో నక్సలైట్ల అరాచకాల వల్ల బిహార్ ప్రజలు భయంభయంగా బతికారు. నక్సలైట్ల కారణంగా అభివృద్ధి ఆగిపోయింది. పిల్లల చదువులు దెబ్బతిన్నాయి. రోడ్లు వేస్తున్న కార్మికులను కూడా హత్య చేశారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం పట్ల నక్సలైట్లకు ఏమాత్రం విశ్వాసం లేదు.

2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తీవ్రవాద నిర్మూలనపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. మా కృషి ఫలితంగా దేశంలో మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య 125 నుంచి 18కి పడిపోయింది. రోడ్లు నిర్మిస్తున్నాం, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. మావోయిజం పూర్తిగా అంతమయ్యే రోజు దగ్గర్లోనే ఉంది. శాంతి, సౌభాగ్యం, విద్య ప్రతి గ్రామానికీ చేరుకుంటాయి'' అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు.

'పహల్గాం' బాధిత కుటుంబానికి పరామర్శ

పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన శుభం ద్వివేది కుటుంబ సభ్యులను ప్రధానమంత్రి పరామర్శించారు. కాన్పూర్‌లోని చాకేరి ఎయిర్‌పోర్టులో వారిని కలుసుకున్నారు. మోదీని చూసి వారంతా బోరున విలపించారు. ఈ సందర్భంగా మోదీ సైతం తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఆందోళన వద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని శుభం ద్వివేది కుటుంబానికి భరోసా కల్పించారు.

మొదటి పేజీ తరువాయి

## ఈటల, హరీశ్‌రావు ఇద్దరూ కలిసి .. కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడారు: మహేశ్‌కుమార్‌గౌడ్



ఈ కబురు,హైదరాబాద్: సర్జికల్ స్ట్రయిక్స్ చేసి గొప్పలు చెప్పుకొంటున్నారు.. అప్పట్లో ఇందిరా గాంధీ వందల కొద్దీ సర్జికల్ స్ట్రయిక్స్ చేసినా ఏనాడూ చెప్పుకోలేదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందిరాగాంధీ గొప్పతనాన్ని ఆనాడు వాజ్‌పేయీ కూడా గుర్తించి.. అపర కాళీ అని మెచ్చుకున్నారని గుర్తు చేశారు. అసలు ఇందిరాగాంధీకి.. మోదీకి పోలిక ఏంటని ప్రశ్నించారు. ''భాజపా, భారాస సయోధ్య గురించి కవిత ఇప్పుడు బయటపెడుతున్నారు. బండి సంజయ్‌ను భాజపా అధ్యక్ష పదవి నుంచి అన్యాయంగా తొలగించలేదా? భారాసతో దోస్తీకి అడ్డుగా ఉన్నందుకే సంజయ్‌ను తొలగించింది వాస్తవం కాదా? భాజపా నేతల ప్యాకేజీల గురించి రాజాసింగే చెబుతున్నారు. రాజాసింగ్ మాటలకు ఆ పార్టీ పెద్దలు సమాధానం చెప్పాలి. షామీర్‌పేటలోని ఓ ఫామ్‌హౌస్‌లో ఈటల రాజేందర్, హరీశ్‌రావును కలిశారు. ఇద్దరూ కలిసి కేసీఆర్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఈటల రాజేందర్.. మోదీ పార్టీలో ఉన్నారా?కేసీఆర్ పార్టీలో ఉన్నారా? కాళేశ్వరం స్కామ్ నుంచి బయటపడేందుకు ఈటల.. కేసీఆర్‌తో చేతులు కలుపుతున్నారు'' అని మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు.

మొదటి పేజీ తరువాయి

## సుంకాలపై మళ్లీ ట్రంప్‌దే పైచేయి.. మరో కోర్టులో అనుకూల తీర్పు



ఈ కబురు: ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలపై భారీస్థాయిలో సుంకాలను విధించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు ట్రేడ్ కోర్టులో ఎదురుదెబ్బ తగిలిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సుంకాల విధింపునకు యూఎస్‌లోని మరో కోర్టు అనుమతించింది . ట్రంప్ ప్రభుత్వం విధించిన సుంకాలు అమలుకాకుండా ట్రేడ్ కోర్టు నిలుపుదల చేసింది. దీనిపై ట్రంప్ సర్కారు అప్పీల్ దాఖలు చేసింది. గురువారం (స్థానిక కాలమానం ప్రకారం) విచారణ జరిపిన న్యాయస్థానం.. ప్రభుత్వ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకొని దిగువ కోర్టు ఇచ్చిన తీర్పును నిలిపివేస్తున్నట్లు పేర్కొంది. దీనిపై జూన్ 5లోగా ఫిర్యాదుదారులు, జూన్ 9లోగా పరిపాలనాధికారులు స్పందించాలని తెలిపింది. ఏప్రిల్ 2న 'లిబరేషన్ డే' పేరుతో ట్రంప్ పలు దేశాలపై సుంకాలను విధించిన సంగతి తెలిసిందే. దీనిపై ట్రంప్ తన అధికార పరిధిని అతిక్రమించారని, దేశ వాణిజ్య విధానం తన వెర్రి ఆలోచనలకు అనుగుణంగా పని చేయాలని కోరుకుంటున్నారంటూ న్యూయార్క్‌లోని అమెరికా అంతర్జాతీయ వాణిజ్య కోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం.. సుంకాల విధింపునకు కత్తెర వేసింది. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే అంతర్జాతీయ అత్యయిక ఆర్థిక అధికారాల చట్టం కింద అధ్యక్షుడికి ప్రపంచదేశాలపై ఆర్థిక ఆంక్షలు విధించే అవకాశం ఉంటుందని న్యాయస్థానం తేల్చి చెప్పింది. సుంకాలకు సంబంధించి ప్రస్తుతం పలు దేశాలతో చర్చలు జరుగుతున్నాయనే విషయాన్ని ట్రంప్ సర్కారు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లింది. ఈ ట్రేడ్ డీల్స్‌ను ఖరారు చేసుకునేందుకు జులై 7 వరకు గడువు ఉందని, అప్పటివరకు దీన్ని చాలా సున్నితమైన అంశంగా పరిగణించాలని కోర్టును కోరింది. అయితే ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ చేసిన అన్ని వాదనలను కోర్టు తిరస్కరించింది. ఈక్రమంలోనే చైనాతో వాణిజ్య సంధిని, భారత్‌పాక్ మధ్య ఘర్షణలు పెంచుతుందని అధికారులు కోర్టులో వాదించారు. ''టారిఫ్ అధికారం వల్లనే ఇటీవల భారత్‌పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని ట్రంప్ సాధించగలిగారు'' అని కోర్టుకు తెలిపారు. అయితే, ఈ వాదనలను కోర్టు తోసిపుచ్చింది.

మొదటి పేజీ తరువాయి

## చైనా త్రీ గోర్జెస్ డ్యామ్‌కు సమానమైన ఇంజినీరింగ్ అద్భుతం కాళేశ్వరం: కేటీఆర్



ఈ కబురు,హైదరాబాద్: దృఢ నాయకత్వం, ప్రజల జీవితాలను మార్చాలన్న చిత్తశుద్ధి ఉంటే అద్భుతమైన ప్రగతి సాధ్యమని తెలంగాణ రాష్ట్రం నిరూపించిందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తొమ్మిదేళ్ల భారాస పాలనలో తెలంగాణ సాధించిన విజయాలు దేశానికే కాదు ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సంపద సృష్టించడంతో పాటు సమాజంలోని అట్టడుగు వర్గాలకు సమానంగా పంచడమే తమ హయాంలో తెలంగాణను దేశంలోనే ప్రత్యేకంగా నిలిపిందని వివరించారు. లండన్‌లో జరుగుతున్న బ్రిడ్జ్ ఇండియా వీక్ 2025 సదస్సులో.. 'స్థిరమైన వృద్ధితో ప్రపంచ ఆర్థిక రంగాన్ని నడిపించడంలో తెలంగాణ ఎందుకు ముఖ్యం?' అనే అంశంపై కేటీఆర్ ప్రధాన ఉపన్యాసం ఇచ్చారు.

భారాస హయాంలో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో విప్లవాత్మక పంథాను అనుసరించి వివిధ రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు, విధానాలపై తన అనుభవాలు, ఆలోచనలను పంచుకున్నారు. కేసీఆర్ నాయకత్వంలోని భారాస ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి మధ్య అద్భుత సమతుల్యత సాధించిందన్నారు.తమ హయాంలో పాలనను ప్రజలకు చేరువ చేయడంతో పాటు ప్రభుత్వ జోక్యాన్ని తగ్గించి వ్యక్తుల కంటే విధానాలకే ప్రాధాన్యత ఇచ్చామన్నారు. విప్లవాత్మక మార్పులను ఆహ్వానించడంతో పాటు నిర్ణయాధికారాన్ని వికేంద్రీకరించడమే తెలంగాణను మిగతా రాష్ట్రాల కంటే ప్రత్యేకంగా మార్చిందని తెలిపారు. ఇంజనీరింగ్ అద్భుతంగా చెప్పుకొనే చైనాలోని త్రీ గోర్జెస్ డ్యామ్‌కు సరిసమానమైన ప్రాజెక్టు తెలంగాణలోని కాళేశ్వరం అని వివరించారు. ప్రతి సీజన్‌కు 45 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నామని... అన్ని రకాల అనుమతులను తీసుకొని, నిర్వాసితులకు సరైన పరిహారం ఇచ్చి కేవలం మూడేళ్లలోనే ప్రాజెక్టును పూర్తి చేసి దేశం మొత్తం నివ్వెరపోయేలా చేశామని పేర్కొన్నారు. కేసీఆర్ నేతృత్వంలో దేశంలోనే తొలిసారి కోటి ఇళ్లకు మిషన్ భగీరథతో సురక్షిత మంచినీటిని అందించినట్లు వివరించారు.

మొదటి పేజీ తరువాయి

## పారిశ్రామికవేత్తల ద్వారానే సంపద సృష్టి సాధ్యం: సీఎం చంద్రబాబు



ఈ కబురు,ఢిల్లీ: సంపద సృష్టి జరగకపోతే సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేమని.. సంపద సృష్టి పారిశ్రామికవేత్తల ద్వారానే సాధ్యమవుతుందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దిల్లీలో జరిగిన సీఐఐ వార్షిక సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రభుత్వ విధానాలు, ఏపీలో అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలను వివరించారు. సంపద సృష్టిలో ఏపీకి పారిశ్రామిక వేత్తలు సహకరించాలని కోరారు. పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశగతిని మార్చేశాయన్నారు. 1990లో ఇంటర్‌నెట్ విప్లవం వచ్చిందని, దాన్ని ముందుగా అందుకున్న వాళ్లలో తానూ ఒకడినని పేర్కొన్నారు. ప్రస్తుతం భారత్‌కు జనాభా అనుకూలత ఉందన్న చంద్రబాబు.. డెమోగ్రాఫిక్ డివిడెండ్‌ను భారత్ సరిగ్గా ఉపయోగించుకోవాలన్నారు. మోదీ నాయకత్వం.. దేశానికి ఓ ప్రధాన బలం

''ప్రస్తుతం ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, డ్రోన్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. సీసీ కెమెరాలు, సెన్సార్లు, ఐఓటీలు.. ఇలా చాలా టెక్నాలజీ వచ్చింది. ఇప్పుడు సమాజానికి కావాల్సింది పారిశ్రామికవేత్తలే. నేను నాలుగోసారి ముఖ్యమంత్రిగా ఉన్నా.. చాలా మంది నాయకులను చూశాను. సరైన సమయంలో సరైన నాయకుడిగా మోదీ ప్రధానిగా ఉన్నారు. మోదీ నాయకత్వం.. దేశానికి ఓ ప్రధాన బలం.అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తున్నాం. గతంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అన్నాను.. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటున్నాను. విశాఖలో టీసీఎస్ మొదలవుతోంది.. ఆర్సెల్లార్ మిట్టల్ పరిశ్రమ ప్రారంభం కాబోతోంది. విశాఖకు గూగుల్ రాబోతోంది. ఏపీలో గ్రీన్ ఎనర్జీకి మంచి అవకాశాలు ఉన్నాయి. సోలార్, విండ్, పంప్డ్ ఎనర్జీ.. అన్నింటిలోనూ ఏపీ ముందు వరుసలో ఉంది. గ్రీన్ ఎనర్జీ కోసం ఎన్నో కంపెనీలు చాలా ఆసక్తిగా ఉన్నాయి. ఏడాదిలో రూ.5లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు అందుకున్నాం. ఈ ప్రాజెక్టుల ద్వారా నాలుగున్నర లక్షల ఉద్యోగాలు వస్తాయి. మైనింగ్, టూరిజంలోనూ ఏపీలో మంచి అవకాశాలు ఉన్నాయి. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటవుతోంది. 175 నియోజకవర్గాల్లో 175 పారిశ్రామిక పార్క్‌లు ఏర్పాటు చేస్తాం. ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్త రావాలన్నదే నా లక్ష్యం. గతంలో ఉమ్మడి ఏపీ సీఎంగా ఉన్నప్పుడు వరుసగా 78 ఏళ్లు సీఐఐ సదస్సులు నిర్వహించాం. మొదటి నుంచి పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ వచ్చాను'' అని చంద్రబాబు వివరించారు.

మొదటి పేజీ తరువాయి

## ఇందిరమ్మ ఇళ్లకు 2.10లక్షల లబ్ధిదారులు ఎంపిక: పొంగులేటి

ఈ కబురు,హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లకు ఇప్పటి వరకు 2.10లక్షల మంది లబ్ధిదారులు ఎంపికైనట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వచ్చే నెల 10లోగా మిగతా లబ్ధిదారుల జాబితా సిద్ధమవుతుందన్నారు. పైలట్ ప్రాజెక్టులో 42వేల ఇళ్లు మంజూరు చేయగా.. 24వేలు ప్రారంభమయ్యాయని, సుమారు వంద ఇళ్లు గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ''లబ్ధిదారుల జాబితాకు సంబంధించి ప్రతిపక్ష ఎమ్మెల్యేలను 40 శాతం పేర్లు ఇవ్వమన్నాం. మిగతా 60శాతం ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేస్తాయి. కేటీఆర్ జాబితా ఇవ్వలేదు.. అధికారులనే ఎంపిక చేయమన్నారు. ఐటీడీఏ పరిధిలో చెంచులకు 9,200 ఇళ్లు మంజూరు చేశాం. హైదరాబాద్‌లోని 16 స్లమ్స్‌లో నాలుగంతస్తుల భవనాలు నిర్మిస్తాం. వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లోనూ ఇదే తరహాలో నిర్మి

## బీజేపీతో పొత్తుపెట్టుకున్న ఏ పార్టీ బాగుపడలేదు : ఎమ్మెల్సీ కవిత

**ఈ కబురు,మంచిర్యాల: నాకంటూ సొంత అజెండా ఏమీలేదు. పార్టీని కాపాడుకోవాలనేది నా తపన అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మరోసారి స్పష్టం చేశారు.**


ఎమ్మెల్సీ కవిత శుక్రవారం మంచిర్యాల జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. 'నాకు సొతంత అజెండా ఏమీలేదు. పార్టీని కాపాడుకోవాలనేది నా తపన. బీజేపీలో పార్టీని విలీనం చేయొద్దనేది నా వాదన. బీజేపీతో పొత్తు పెట్టుకున్న ఏ పార్టీ బాగుపడలేదు. నేను జైల్లో ఉన్నప్పుడు పార్టీని బీజేపీలో కలుపుతానని అన్నారు. పార్టీని బీజేపీలో కలుపుతానంటే నేను ఒప్పుకోను. లెటర్ రాయడంలో నా తప్పేమీ లేదు. లెటర్ బయటపెట్టిన వారిని పట్టుకోండి' అని వ్యాఖ్యానించారు.



## హైదరాబాద్‌లో భారీ అగ్ని ప్రమాదం..

### రెసిడెన్షియల్ బిల్డింగ్‌లో పేలిన ఏసీ కంప్రెసర్‌లు

ఈ కబురు, హైదరాబాద్: మధురానగర్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. రెసిడెన్షియల్ బిల్డింగ్‌లో ఏసీ కంప్రెసర్‌లు పేలిపోయాయి. G+5 బిల్డింగ్‌లో సెకండ్ ఫ్లోర్‌లో ఈ ప్రమాదం జరిగింది. ఘటన స్థలానికి అగ్నిమాపక దళాలు చేరుకున్నాయి. మంటలను అదుపు చేస్తున్నారు.నగర వాసులను వరుస అగ్ని ప్రమాదాలు భయపెడుతున్నాయి. ఈ నెలలోనే చార్మినార్ గుల్జార్‌హౌస్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో 17మంది మృతి చెందిన సంగతి తెలిసిందే. షార్ట్ సర్క్యూట్ జరిగిన ప్రమాదంలో మొత్తం 17మందిని ఆస్పత్రికి తరలించారు. ఏడుగురు చిన్నారులు, నలుగురు మహిళలు సహా మొత్తం 17 మంది ప్రాణాలు కోల్పోయారు.అంతకుముందు పాతబస్తీలోని మహారాజ్‌గంజ్‌లోని స్క్రాప్ గోదాం (ప్లాస్టిక్ గోడౌన్)లో మంటలు ఎగిసిపడి మూడు అంతస్తులకు వ్యాపించాయి. మంటల్లో చిక్కుకున్నవారిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారు. మొదటి అంతస్తులో డిస్పోజబుల్ ప్లేట్స్ గోడౌన్, రెండో అంతస్తులో యజమాని నివాసం ఉంటున్నారు. ఇక, మూడో అంతస్తులో అద్దెకు ఉంటున్న మరో కుటుంబం. ప్లాస్టిక్ సమాన్లు ఉండటంతో మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు.



# గోపన్ పల్లిలో రెడిమిక్స్ లారీ బీభత్సం



ప్రమాదంలో మృతిచెందిన దిక్కుష్ కుమార్ (ఫైల్)

**వలస కూలీలతో వెళ్తున్న ట్రాలీ ఆటోను ఢీ కొట్టిన రెడీమిక్స్ లారీ**

**ఒకరి మృతి - మరోకరి పరిస్థితి విషమం**

**11 మంది కూలీలకు గాయాలు**

ఈకబురు, శేరిలింగంపల్లి : ఐటీ కారిడార్ సమీపంలోని గోపన్ పల్లిలో ఓ రెడీమిక్స్ లారీ శుక్రవారం బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకు వచ్చిన రెడీమిక్స్ లారీ వలస కూలీలను తీసుకొని వెళుతున్న ఓ ట్రాలీ ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 14 మంది కూలీలు గాయపడ్డారు. గాయపడిన కూలీల్లో ఓ వ్యక్తి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందగా, మరో వ్యక్తి పరిస్థితి విషమంగా ఉంది. గచ్చిబౌలి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో గోపన్ పల్లి ఎన్టీఆర్ నగర్ లేబర్ అడ్డా వద్ద కూలీలను తీసుకొని టాటా ఏస్ ట్రాలీ ఆటో (టీఎస్07 యూహెచ్ 4780) వట్టినాగులపల్లి వైపు బయలుదేరింది. అదే సమయంలో గోపన్ పల్లి వైపు నుంచి వట్టినాగులపల్లి వైపు వెళ్తున్న రెడీమిక్స్ లారీ (టీఎస్30 టీఏ8333) నిర్లక్ష్యంగా, మితిమీరిన వేగంతో దూసుకువచ్చి వలస కూలీలతో ఉన్న ట్రాలీ ఆటోను ఢీకొట్టింది. లారీ వేగంగా వచ్చి ఢీ కొట్టడంతో ఆటో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ కు తగిలి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న 14 మంది కూలీలకు గాయాలయ్యాయి. వీరిని సమీపంలోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. కాగా క్షతగాత్రుల్లో బీహార్ రాష్ట్రం బెగుసరామ్ జిల్లా కాశీనాధప్పురకు చెందిన దిల్కుష్ కుమార్(22) తలకు తీవ్ర గాయాలు కావడంతో సిటీజన్ హస్పిటల్ కు, అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. దిక్కుష్ కుమార్ కు భార్య, ఓ కుమార్తె ఉన్నారు. క్షతగాత్రుల్లో కర్నాటక రాష్ట్రం చించోలీకి చెందిన కీము(45)కు తీవ్ర గాయాలు కావడంతో మదీనగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి అత్యంత విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. ట్రాలీ ఆటో డ్రైవర్ దానాతో పాటు లక్ష్మణ్, సువాలీ, చాంధీ, జాను బాయ్, రవి నాయక్, పీరా, రాహుల్, చందు, నార్య, బాదల్ కుమార్ లకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన శ్రీ డెక్కన్ రెడీ మిక్స్ లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

# ప్రపంచ సుందరి 2025 ఎవరో?

మొదటి పేజీ తరువాయి



ఈ కబురు,హైదరాబాద్: ప్రపంచ సుందరి 2025 ఎవరో తేలే సమయం ఆసన్నమైంది. విశిష్ట అతిథులు.. బాలీవుడ్ తారల ప్రదర్శనల నడుమ హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా శనివారం మిస్‌వరల్డ్ పోటీల ఫైనల్ జరగనుంది. కిరీటాన్ని సొంతం చేసుకునేందుకు 108 దేశాల అందాలభామలు పోటీపడుతున్నారు. మిస్ ఇండియా నందిని గుప్తా సహా 16 మంది సుందరీమణులు ఇప్పటికే టాప్ 40కి చేరుకున్నారు. మరో 24 మందిని న్యాయనిర్ణేతలు శనివారం ఎంపిక చేయనున్నారు. పలు దఫాల వడబోత అనంతరం చివరి దశలో అమెరికాకరేబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియాఓషియానా ఖండాల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేస్తారు. ఈ నలుగురిలో తుది ప్రశ్న ద్వారా మిస్‌వరల్‌డ్‌ను ప్రకటిస్తారు. మిస్ వరల్డ్ 2024 క్రిస్టినా పిజ్కోవా 72వ ప్రపంచ సుందరికి కిరీటాన్ని ధరింపజేస్తారు. ఫైనల్‌కు వేదికైన హైటెక్స్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్తు కాంతులతో శోభాయమానంగా తీర్చిదిద్దారు.

ప్రముఖ నటుడు సోనూసూద్‌కు మిస్‌వరల్డ్ హ్యూమానిటేరియన్ అవార్డును అందజేయనున్నారు.

న్యాయ నిర్ణేతలు వీరే

జ్యూరీ హెడ్: మిస్ వరల్డ్ ఛైర్‌పర్సన్ జూలియా మోర్లే

జ్యూరీ సభ్యులు: సోనూసూద్ (నటుడు), సుధారెడ్డి (ఆంత్రప్రెన్యూర్) కెరినా టిర్రెల్ (2014 మిస్ ఇంగ్లాండ్)

హాజరయ్యే ప్రముఖులు: మానుషి చిల్లర్ (2017 మిస్ వరల్డ్)

2016 మిస్‌వరల్డ్ స్టెఫాని డెల్, ప్రజెంటర్ సచిన్ కుంభార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. బాలీవుడ్ స్టార్లు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ ఖట్టర్‌లు ప్రదర్శనలతో అలరించనున్నారు.

ఆరుసార్లు మన సొంతం..

మిస్‌వరల్డ్ పోటీలు 1951లో ప్రారంభం కాగా మనదేశం మూడోసారి ఆతిథ్యమిస్తోంది. గతంలో బెంగళూరు(1996), ముంబయి(2024)లో జరిగాయి. ప్రపంచసుందరి కిరీటాన్ని మన దేశ భామలు ఆరుసార్లు సొంతం చేసుకున్నారు. రీటా ఫారియా(1966), ఐశ్వర్యారాయ్ (1994), డయానా హెడెన్(1997), యుక్తాముఖి(1999), ప్రియాంక చోప్రా(2000), మానుషి చిల్లర్(2017) కిరీటాన్ని దక్కించుకున్నారు. 1952లో అతితక్కువగా 11 దేశాల భామలు మాత్రమే పోటీపడగా 2013లో అత్యధికంగా 127 దేశాలకు చెందిన అతివలు పోటీపడ్డారు.

మిస్‌వరల్డ్ గ్లోబల్ అంబాసిడర్‌గా సుధారెడ్డి

మేఘా(ఎంఈఐఎల్) సంస్థ డైరెక్టర్ సుధారెడ్డిని మిస్‌వరల్డ్ సంస్థ గ్లోబల్ అంబాసిడర్‌గా నియమించినట్లు సంస్థ ఛైర్‌పర్సన్ జూలియా మోర్లే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ వ్యవహారం.. తెలంగాణ ప్రభుత్వ కీలక ప్రకటన

ఈ కబురు, హైదరాబాద్: మిస్ ఇంగ్లండ్ మిల్లా మ్యాగీ సంచలన ఆరోపణల వ్యవహారంపై విచారణ ముగిసిందని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఈ అంశంపై తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ సాక్షితో శుక్రవారం మాట్లాడారు.''మిస్ ఇంగ్లండ్ మ్యాగీపై తెలంగాణ ప్రభుత్వ విచారణ ముగిసింది. అయితే ఆమె విషయంలో ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోదు. మిస్ వరల్డ్ నిర్వాహకులు లండన్‌లో కేసు వేశారు. ఆమెపై యూకే ప్రభుత్వమే లీగల్ చర్యలు తీసుకుంటుంది'' అని జయేష్ రంజన్ స్పష్టం చేశారు. వ్యక్తిగత, నైతిక కారణాలను చూపుతూ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ 2025 పోటీల నుంచి నిష్క్రమిస్తూ మిల్లా మ్యాగీ స్వదేశానికి తిరిగి వెళ్లిపోయారు. ఆపై ఆమె బ్రిటిష్ టాబ్లాయిడ్ ది సన్‌తో మాట్లాడుతూ సంచలన ఆరోపణలు చేశారు. ''హైదరాబాద్‌లో ఉన్న సమయంలో ధనవంతులైన పురుష స్పాన్సర్లను అలరించాలనడంతో ఎంతో ఒత్తిడికి గురయ్యా. తెలంగాణపై గౌరవం పెరిగింది. అక్కడి అతిథ్యం బాగుంది. కానీ, మేం పోటీలకు వచ్చామో, దేనికొచ్చామో అర్థం కాలేదు.. ఇవేం పోటీలు?'' అని ఆమె అన్నట్లు సదరు టాబ్లాయిడ్ కథనం ఇచ్చింది.

అయితే, మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ ఛైర్మన్, సీఈఓ జూలియా మోర్లీ ఈ ఆరోపణలను ఖండించారు. తన తల్లి అనారోగ్యం కారణంగా కుటుంబ అత్యవసర పరిస్థితి ఏర్పడిందని, అందుకే ఆమె పోటీ నుండి వైదొలగాలని అభ్యర్థించారని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీలు.. గౌరవం, బ్యూటీ విత్ ఏ పర్పస్ విలువలకు కట్టుబడి ఉంది అని స్పష్టం చేశారు.అయితే ఈ వ్యవహారంపై తెలంగాణాలో రాజకీయ దుమారం రేగింది. ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శలు గుప్పించాయి. దీంతో ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.



# విద్యార్థి వీసా.. స్లాట్ల కోసం రోజూ చెక్

## చేసుకోండి- అమెరికా సూచన



**వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్ నిలిపివేత తాత్కాలికమేనని, త్వరలోనే ఈ స్లాట్లు ఓపెన్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అమెరికా విదేశాంగశాఖ వెల్లడించింది.**

ఈ కబురు: విదేశీ విద్యార్థులకు సంబంధించి వీసా ఇంటర్వ్యూల షెడ్యూలింగ్‌ను ట్రంప్ యంత్రాగం ఇటీవల తాత్కాలికంగా నిలిపివేసిన సంగతి తెలిసిందే. అయితే, ఇది తాత్కాలికమేనని, త్వరలోనే ఈ స్లాట్లు ఓపెన్ అయ్యే అవకాశాలు ఉన్నాయని అమెరికా విదేశాంగశాఖ వెల్లడించింది. ఇందుకోసం విదేశీ విద్యార్థులు స్లాట్ బుకింగ్ అందుబాటులోకి వచ్చే విషయమై తరచూ చెక్ చేసుకోవాలని సూచించింది.

"ప్రస్తుతానికి కొంత ఆలస్యం కావచ్చు. అయితే, స్లాట్లు ఎప్పుడు ఓపెన్ అవుతాయనే విషయాన్ని తెలుసుకునేందుకు క్రమం తప్పకుండా అధికారిక వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవాలని సూచిస్తున్నా. ఎప్పుడు అందుబాటులోకి వస్తాయనే విషయాన్ని కచ్చితంగా చెప్పనప్పటికీ.. సాధ్యమైనంత తొందరగా అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది" అని అమెరికా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి టామీ బ్రూస్ వెల్లడించారు. జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవడంపై ట్రంప్ యంత్రాంగం దృష్టి సారించిందని, వీసా ప్రక్రియ కూడా అందులో ప్రధాన భాగమని అన్నారు. వీసా అనేది జన్మహక్కు కాదని, ఇదో ప్రత్యేక అవకాశం అని మరో ప్రశ్నకు ఆమె బదులిచ్చారు.

విద్యార్థుల సామాజిక మాధ్యమ ఖాతాలను క్షుణ్ణంగా పరిశీలించాలని భావిస్తున్న అమెరికా.. అందుకు అవసరమైన సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసే వరకు వీసాల బుకింగ్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఇటీవల ప్రకటించింది. దీంతో భారతీయులు సహా విదేశీ విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. మళ్లీ ఈ స్లాట్లు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయనే విషయమై సందిగ్ధత నెలకొన్న వేళ అమెరికా విదేశాంగశాఖ ఈ విధంగా స్పందించింది.

# మీ సొంత పంచాయితీలు మీరే తేల్చుకోండి.. మమ్మల్ని లాగొద్దు: కవిత వ్యాఖ్యలపై రఘునందన్

**తెరాస (ప్రస్తుతం భారాస) గతంలో అనేక పార్టీలతో పొత్తు పెట్టుకుందని భాజపా ఎంపీ రఘునందన్‌రావు అన్నారు.**

ఈ కబురు,హైదరాబాద్: భాజపా ఎదుగుదలను ఆపాలని కుట్రలు పన్నుతున్నారని ఆ పార్టీ ఎంపీ రఘునందన్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భారాస ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపైనా ఆయన స్పందించారు. ''చిట్‌చాట్‌లు ఎందుకు?.. ధైర్యముంటే ప్రెస్‌మీట్‌లు పెట్టండి. తప్పుడు వార్తలు రాయిస్తున్నారని చెప్పడం ఎందుకు? భారాసతో మా పార్టీ అధిష్ఠానం ఎప్పుడూ మాట్లాడలేదు. లేనిపోని పంచాయితీలు ఎందుకు?.. కుండ బద్ధలు కొట్టినట్లు చెప్పండి. చిట్‌చాట్‌ల పేరుతో మా పార్టీని వివాదంలోకి లాగొద్దని కవితకు విజ్ఞప్తి చేస్తున్నా. మీ సొంత పంచాయితీలు మీరే తేల్చుకోండి.. మమ్మల్ని లాగొద్దు. తెరాస (ప్రస్తుతం భారాస) గతంలో అనేక పార్టీలతో పొత్తు పెట్టుకుంది. 2004లో కాంగ్రెస్‌తో తెరాస పొత్తు పెట్టుకుంది. 2009లో మహా కూటమి పేరుతో పలు పార్టీలతో పొత్తు పెట్టుకుంది. 2014లో పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేస్తామన్నది ఎవరు? భారాసతో భాజపా ఎప్పుడైనా పొత్తు పెట్టుకుందా? హరీశ్ కోవర్టు అయితే ఎందుకు సస్పెండ్ చేయలేదు? రాష్ట్రంలో భాజపా బలం పుంజుకుంటోంది.. కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోంది. పార్లమెంటు ఎన్నికల్లో భారాస ఒక్క సీటూ గెలవలేదు. ఆ పార్టీ చెల్లని రూపాయిగా మారిందని ప్రజలు భావిస్తున్నారు. భాజపా, భారాస ఒక్కటనే తప్పడు ప్రచారం చేస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత చెల్లని రూపాయి అయ్యారు. పదేళ్ల పాలనలో అమరుడు శ్రీకాంత్‌చారి కుటుంబానికి ఏమీ దక్కలేదు. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన 1200 మంది అమరులను పట్టించుకోలేదు. కేసీఆర్ కుటుంబం పదేళ్లు దోచుకుంది. హరీశ్‌రావు భాజపా కోవర్టు అయితే మంత్రివర్గం నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదు? భారాస బలహీనపడాలి అనుకునేవాళ్లే కవిత వెనక ఉన్నారు. ఆమె కొత్త పార్టీ పెడుతోందని నాకు సమాచారముంది. భారాసకు అభ్యర్థులు లేక ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయలేదు. కోవర్టు పని చేసే వాళ్లు భాజపాలో ఉండరు'' రఘునందన్‌రావు వ్యాఖ్యానించారు



# 2014- 2023 సినిమాలకు గద్దర్ అవార్డులు.. ఉత్తమ చిత్రాలివే!



ఈ కబురు: తెలంగాణ ప్రభుత్వం అందించనున్న గద్దర్ అవార్డులపై ప్రముఖ సినీనటుడు, జ్యూరీ ఛైర్మన్ మురళీమోహన్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఎఫ్‌డీసీ ఛైర్మన్, నిర్మాత దిల్‌రాజుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 2014 నుంచి 2023 వరకు విడుదలైన సినిమాలకు గద్దర్ అవార్డులను ప్రకటించారు. ఏడాదికి మూడు చిత్రాల చొప్పున ఉత్తమ సినిమాలకు అవార్డులను వెల్లడించారు. 2014 జూన్ 2 నుంచి సెన్సార్ అయిన సినిమాలను పరిగణనలోకి తీసుకున్నట్లు చెప్పారు. వీటితోపాటు సినీ రంగానికి సేవలు అందించిన వారికి ఆరు ప్రత్యేక అవార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజాకవి, దివంగత కాళోజీకి స్పెషల్ జ్యూరీ అవార్డును ప్రకటించారు.

**సంవత్సరాల వారీగా ఉత్తమ చిత్రాలివే..**

**2014**
**ప్రథమ ఉత్తమ చిత్రం: రన్ రాజా రన్**
**రెండో ఉత్తమ చిత్రం: పాఠశాల**
**మూడో ఉత్తమ చిత్రం : అల్లుడు శీను**

**2015**
**ప్రథమ ఉత్తమ చిత్రం: రుద్రమదేవి**
**రెండో ఉత్తమ చిత్రం: కంచె**
**మూడో ఉత్తమ చిత్రం: శ్రీమంతుడు**

**2016**
**ప్రథమ ఉత్తమ చిత్రం: శతమానం భవతి**
**రెండో ఉత్తమ చిత్రం: పెళ్ళి చూపులు**
**మూడో ఉత్తమ చిత్రం: జనతా గ్యారేజ్**

**2017**
**ప్రథమ ఉత్తమ చిత్రం: బాహుబలి 2**
**రెండో ఉత్తమ చిత్రం: ఫిదా**
**మూడో ఉత్తమ చిత్రం: ఘాజీ**

**2018**
**ప్రథమ ఉత్తమ చిత్రం: మహానటి**
**రెండో ఉత్తమ చిత్రం: రంగస్థలం**
**మూడో ఉత్తమ చిత్రం: కేరాఫ్ కంచరపాలెం**

**2019**
**ప్రథమ ఉత్తమ చిత్రం: మహర్షి**
**రెండో ఉత్తమ చిత్రం: జెర్సీ**
**మూడో ఉత్తమ చిత్రం: మల్లేశం**

**2020**
**ప్రథమ ఉత్తమ చిత్రం: అల వైకుంఠపురములో..**
**రెండో ఉత్తమ చిత్రం: కలర్ ఫొటో**
**మూడో ఉత్తమ చిత్రం: మిడిల్ క్లాస్ మెలొడీస్**

**2021**
**ప్రథమ ఉత్తమ చిత్రం: ఆర్ఆర్ఆర్**
**రెండో ఉత్తమ చిత్రం: అఖండ**
**మూడో ఉత్తమ చిత్రం: ఉప్పెన**

**2022**
**ప్రథమ ఉత్తమ చిత్రం: సీతారామం**
**రెండో ఉత్తమ చిత్రం: కార్తికేయ 2**
**మూడో ఉత్తమ చిత్రం: మేజర్**

**2023**
**ప్రథమ ఉత్తమ చిత్రం: బలగం**
**రెండో ఉత్తమ చిత్రం: హనుమాన్**
**మూడో ఉత్తమ చిత్రం: భగవంత్ కేసరి**

# పసలేని ఆరోపణలపై స్పందించను



భాజపాలో భారాస విలీనమంటూ కవిత చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అదో ఫ్యామిలీ డ్రామా.. మేం పాత్రధారులం కాదలచుకోలేదని స్పష్టీకరణ

ఈ కబురు, దిల్లీ: భాజపాలో భారాస విలీనానికి ప్రయత్నం జరుగుతున్నట్లు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అలాంటి పసలేని ఆరోపణలపై తాను స్పందించదలచుకోలేదన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన ఇక్కడ తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ''ఈ అంశంపై మాట్లాడటానికి వారికున్న విశ్వసనీయత ఏంటి? ఆమె జైలుకు ఎందుకెళ్లారు? అలాంటి ఆమె చేసిన ఆరోపణలకు మేం జవాబు చెప్పాలా?'' అని ప్రశ్నించారు. ప్రస్తుతం భారాసలో నడుస్తున్నది డాడీడాటర్, సిస్టర్‌బ్రదర్ సమస్య అని, అదో ఫ్యామిలీ డ్రామా అని అభివర్ణించారు. అందులో తాము పాత్రధారులం, సూత్రధారులం కాదలచుకోలేదని స్పష్టంచేశారు. ఒక పార్టీ, కుటుంబ అంతర్గత సమస్యను తెలంగాణ ప్రజలకో, రాజకీయపార్టీలకో సంబంధించిన విషయంగానో, భాజపా వ్యతిరేక అంశంగానో చూడటంలేదన్నారు. భాజపాలో భారాస విలీనం కోసం కేసీఆర్ ఎవర్ని సంప్రదించారో కవిత తన తండ్రినే అడగాలన్నారు. ప్రస్తుతం భారాసలో అధికారం, ఆస్తుల కోసం ఘర్షణ జరుగుతోందని.. దాన్ని తెలంగాణ అంశంగా మీడియా చిత్రీకరించడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఇది చాలా చిన్న అంశమని, దీనిపై స్పందించాల్సిన అవసరం లేదని తాను అన్ని పార్టీలనూ కోరుతున్నట్లు చెప్పారు. తమ పార్టీ నాయకులు కూడా ఇలాంటి వాటిపై స్పందించాల్సిన అవసరం లేదని స్పష్టంచేశారు. భారాస అన్నదే ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ అని, అందులో వీరంతా డైరెక్టర్లని ఎద్దేవా చేశారు.

రేవంత్‌రెడ్డికి రాహుల్ అపాయింట్‌మెంట్ ఇవ్వకపోడం తెలంగాణ ప్రజలను అవమానించినట్లే

దిల్లీలో పీసీసీ అధ్యక్షుడిని కలిసిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మాత్రం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడం తెలంగాణ ప్రజలను అవమానించినట్లేనని కిషన్‌రెడ్డి ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అంజయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజీవ్‌గాంధీ ఇలాగే తెలంగాణ ప్రజలను అవమానించారని గుర్తుచేశారు.

అయినా రాహుల్ పలుకులే పలుకుతున్న రేవంత్..

ఆపరేషన్ సిందూర్‌కు వ్యతిరేకంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటంపై కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి దిల్లీకొచ్చి మూడురోజులు రాహుల్‌గాంధీ దర్శనం కోసం ఆపసోపాలు పడి, అవమానానికి గురై తిరిగి వెళ్లిపోయినా.. రాహుల్ మాటలను వల్లెవేస్తూ తెలంగాణ గడ్డ నుంచి భారత సైనికులను అవమానించేలా మాట్లాడటం దుర్మార్గమన్నారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో ఆర్ఆర్ఆర్ (రాహుల్, రాబర్ట్ వాద్రా, రేవంత్‌రెడ్డి)ల మాటలు ఒకేలా ఉన్నాయని దుయ్యబట్టారు. దేశ రక్షణకు సంబంధించిన కీలక అంశాల్లో బాధ్యతారహితంగా మాట్లాడే రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నాయకుడిగా ఉండటం ప్రజల దురదృష్టమన్నారు. బడేమియా రాహుల్‌గాంధీ మాటలకు వత్తాసుగా చోటేమియా రేవంత్‌రెడ్డి మాట్లాడటం భారత సైన్యాన్ని అవమానించడమేనన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయి ఉంటే పీఓకేని ఆక్రమించుకొనేవారన్న రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు అత్యంత హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. పీఓకే, జమ్మూకశ్మీర్‌లను ఇన్నేళ్లు రావణకాష్టంలా నడిపింది కాంగ్రెస్ పార్టీయేనని ఆరోపించారు. కాంగ్రెస్ దేశ వ్యతిరేక వైఖరి తెలిసే మూడు సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీకి కర్రుకాల్చి వాతపెట్టారని, రాబోయే ఎన్నికల్లో కూడా వాతపెట్టడం ఖాయమన్నారు. తెలంగాణవ్యాప్తంగా గతంలో పాకిస్థాన్ ఐఎస్ఐ కార్యకలాపాలు జరిగేవని.. మోదీ ప్రభుత్వం వాటన్నింటినీ ధ్వంసం చేసిందని పేర్కొన్నారు. గత 11 ఏళ్లలో భారత ప్రభుత్వం చేసిన పని కారణంగా పాకిస్థాన్ ప్రపంచ దేశాల ముందు చిప్పపట్టుకొనే పరిస్థితి వచ్చిందన్నారు.




## భారత్‌లో యాపిల్ మూడో స్టోర్.. ఎక్కడంటే?

టెక్ సంస్థ యాపిల్ భారత్‌లో మూడో స్టోర్ ఏర్పాటుచేయనుంది. దీనికోసం బెంగళూరు నగరాన్ని ఎంచుకుంది. ప్రముఖ టెక్ సంస్థ యాపిల్ భారత్‌లో తయారీ, విక్రయ కార్యకలాపాలను వేగంగా విస్తరిస్తోంది. ఇప్పటికే ముంబయి, దిల్లీలో ఉన్న స్టోర్లకు వచ్చిన ఆదరణ నేపథ్యంలో విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. త్వర-లోనే మూడో స్టోర్‌ను ప్రారంభించనుంది. దీనికోసం బెంగళూరును ఎంచుకుంది. హెబ్బాల్‌లోని ఫీనిక్స్ మాల్‌లో నూతన స్టోర్ ఏర్పాటు చేయనుంది. బెంగళూరు ఫీనిక్స్ మాల్ మొదటి అంతస్తులో 8,000 చదరపు అడుగుల విస్తీర్ణంతో యాపిల్ మూడో స్టోర్‌ను ఏర్పాటుచేయనుంది. ది-ల్లీలోని ఔట్‌లెట్ మాదిరిగానే బెంగళూరు స్టోర్ ఉండనుంది. ఈ స్థలాన్ని యాపిల్ 10 సంవత్సరాల పాటు లీజుకు తీసుకున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ స్టోర్ ప్రారంభం కానున్నట్లు సమాచారం. భారత్‌లో వ్యాపార వృద్ధికి ఇంకా భారీ అవకాశాలున్నాయని యాపిల్ సీఈఓ టిమ్‌కుక్ తాజాగా వెల్ల-డించారు. ఇందుకు అనుగుణంగా దేశంలో నాలుగు రిటైల్ స్టోర్లు నెలకొల్పే యోచనలో ఉన్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.



# గోల్డ్‌లోన్స్ మార్గదర్శకాలపై కేంద్రం జోక్యం.. ఆ షేర్లు జంప్

**గోల్డ్ లోన్స్‌పై ఆర్‌బీఐ ప్రతిపాదించిన కొత్త మార్గదర్శకాల నుంచి చిన్న రుణగ్రహీతలను మినహాయించాలని ఆర్థికశాఖ సూచించింది.**

బంగారం తాకట్టు పెట్టి తీసుకునే రుణాలకు సంబంధించిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతిపాదించిన కొత్త మార్గదర్శకాలపై ఆర్థిక మంత్రిత్వశాఖ జోక్యం చేసుకుంది. రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకొనే చిన్న రుణగ్రహీతలను ఈ మార్గదర్శకాల నుంచి మినహాయించాలని ఆర్‌బీఐకు సూచించింది. తమిళనాడులోని రాజకీయ పార్టీల నుంచి, భాగస్వామ్య పక్షాల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతున్నవేళ ఆర్థిక శాఖ నుంచి ఈ ప్రకటన వచ్చింది.

ఈ ఏడాది ఏప్రిల్ 9న ఆర్‌బీఐ పసిడి రుణాలపై ముసాయిదా మార్గదర్శకాలను జారీ చేసింది. అందులో పసిడిని తనఖా పెట్టుకొని ఇచ్చే రుణ విలువ, ఆ పసిడి విలువలో 75 శాతం కంటే అధికంగా ఉండరాదని పేర్కొంది. దీనివల్ల చిన్న, సన్నకారు రైతులకు రుణాలు లభించడం కష్టమవుతుందంటూ తమిళనాడులోని రాజకీయ పార్టీలు, రైతు సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. కొత్త మార్గదర్శకాల విషయంలో జోక్యం కోరుతూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు.

ఈనేపథ్యంలో ఆర్‌బీఐ జారీ చేసిన ముసాయిదాను ఆర్థిక సేవల విభాగం పరిశీలించింది. చిన్న బంగారు రుణగ్రహీతల అవసరాలపై ప్రభావం పడకుండా కొత్త మార్గదర్శకాలు ఉండాలని ఆర్‌బీఐకి సూచించింది. అందులోభాగంగానే రూ.2 లక్షల వరకు రుణాలు తీసుకొనేవారికి వాటినుంచి మినహాయించాలని తెలిపింది. కొత్త మార్గదర్శకాలు క్షేత్రస్థాయిలో అమలుచేసేందుకు సమయం పడుతుంది కాబట్టి 2026 జనవరి 1 నుంచి కొత్త నిబంధనలు అమలుచేయాలని ఆర్‌బీఐకి ఆర్థికశాఖ సూచించింది.

ఆర్థిక శాఖ నుంచి ఈ ప్రకటన వెలువడిన నేపథ్యంలో బంగారు రుణాలు మంజూరుచేసే కంపెనీల షేర్లు దూసుకెళ్తున్నాయి. ముత్తూట్ ఫైనాన్స్ షేర్లు ఇంట్రాడేలో 8.6 శాతం లాభపడి రూ.2,243 (ఎన్ఎస్ఈ) వద్ద గరిష్ఠాన్ని తాకాయి. మణప్పురం ఫైనాన్స్ షేర్లు ఎన్ఎస్ఈలో 4 శాతం పెరగ్గా, ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ 2 శాతం పెరిగింది. ముత్తూట్ ఫైనాన్స్ జారీ చేసే రుణాల్లో 98 శాతం వరకు బంగారం తాకట్టు పెట్టుకొని ఇచ్చేవే కావడం గమనార్హం.

# కరెన్సీ నోట్ల ముద్రణ ఖర్చు రూ.6,372 కోట్లు




**బ్యాలెన్స్ షీటు రూ.76.25 లక్షల కోట్లకు పెరగడం వల్లే కేంద్రానికి రూ.2.7 లక్షల కోట్ల డివిడెండు ఇవ్వగలిగినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) వెల్లడించింది. భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ అత్యంత వేగవంతమైన ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని.**

**విదేశీ మారకపు లాభాలు రూ.1.11 లక్షల కోట్లు**
**టారిఫ్ విధానాల్లో మార్పులతో ఎగుమతులపై ప్రభావం**
**బ్యాలెన్స్‌షీటు పెరగడంతోనే భారీ డివిడెండు**
**ఆర్‌బీఐ వార్షిక నివేదిక**

**ముంబయి:** బ్యాలెన్స్ షీటు రూ.76.25 లక్షల కోట్లకు పెరగడం వల్లే కేంద్రానికి రూ.2.7 లక్షల కోట్ల డివిడెండు ఇవ్వగలిగినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) వెల్లడించింది. భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ అత్యంత వేగవంతమైన ప్రధాన ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని, ఇందుకు బలమైన స్థూల ఆర్థిక మూలాలు చేదోడుగా నిలుస్తాయని గురువారం విడుదల చేసిన వార్షిక నివేదికలో ఆర్‌బీఐ పేర్కొంది.

**నివేదిక ముఖ్యాంశాలు..**

అంతర్జాతీయ మార్కెట్ ఊగిసలాటలు, భౌగోళికరాజకీయ ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చితి, సరఫరాలో ఇబ్బందులు, పర్యావరణ మార్పులు వంటివి ఆర్థిక వ్యవస్థకు సవాళ్లు విసరొచ్చు.

అంతర్జాతీయంగా కమొడిటీ ధరలు తగ్గుతుండడం, మంచి వర్షాలతో దేశీయంగా వ్యవసాయ దిగుబడులు పెరిగితే ద్రవ్యోల్బణం మరింత కిందకు దిగిరావొచ్చు.

వాణిజ్య విధానాల్లో మార్పుల వల్ల ఆర్థిక మార్కెట్లలో ఊగిసలాటలకు అవకాశం ఉంది. టారిఫ్ యుద్ధాల వల్ల ఎగుమతులపైనా ప్రభావం పడొచ్చు. అయితే వివిధ దేశాలతో మనదేశం కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాల వల్ల ఆ ప్రభావం తగ్గొచ్చు.

సేవల ఎగుమతులు, దేశంలోకి ప్రవాసులు పంపే రెమిటెన్సెస్ వల్ల కరెంట్ ఖాతా లోటు కొత్త ఏడాదిలో నిర్వహించదగ్గ స్థాయిలోనే ఉండొచ్చు.

వరుసగా రెండు సమీక్షల్లో కీలక రేట్లను తగ్గించినందున, ద్రవ్యోల్బణాన్ని 4% లోపు కట్టడి చేయగలం.

మార్చి 31 నాటికి మొత్తం మీద మిగులు ఏడాది కిందటితో పోలిస్తే 27.37% పెరిగి రూ.2.68 లక్షల కోట్లకు చేరింది. విదేశీ మారకపు ద్రవ్య లావాదేవీల వల్ల లాభాలు 33% పెరిగి రూ.1.11 లక్షల కోట్లకు చేరాయి. గత ఆర్థిక సంవత్సరంలో కరెన్సీ నోట్ల ప్రింటింగ్‌కు రూ.6,372.82 కోట్లు వెచ్చించారు. 202324లోని రూ.5,101.4 కోట్లతో పోలిస్తే ఈ వ్యయం 25% పెరిగింది. 202425లో చలామణీలో ఉన్న బ్యాంకు నోట్ల విలువ, పరిమాణం వరుసగా 6%, 5.6% పెరిగాయి. రూ.500 నోట్ల వాటా విలువ పరంగా 86%, పరిమాణం పరంగా 40.9% ఉంది. 2023 మే నుంచి రూ.2000 బ్యాంకు నోట్ల ఉపసంహరణ కొనసాగుతోంది. ఈ ఏడాది మార్చి 31 నాటికి 98.2% (విలువ రూ.3.56 లక్షల కోట్లు) నోట్లు వెనక్కి వచ్చాయి. రూ.2, రూ.5, రూ.2000 నోట్లను కొత్తగా ముద్రించడం లేదు. రూ.10, రూ.20, రూ.50, రూ.100, రూ.2000 నోట్లలో నకిలీ నోట్లు తగ్గగా.. రూ.200, రూ.500 నోట్లలో వరుసగా 13.9%, 37.3% నకిలీలు పెరిగాయి. కాలం చెల్లిన నోట్లతో పార్టికల్ బోర్డులను తయారు చేయనున్నారు.



## ఫ్లాట్‌గా ట్రేడవుతున్న స్టాక్ మార్కెట్లు.. నిఫ్టీ@24,800



**అంతర్జాతీయ మార్కెట్లలో బలహీన సంకేతాల నడుమ దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు నష్టాల్లో ప్రారంభమయ్యాయి.**

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం నష్టాల్లో ప్రారంభమయ్యాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన ప్రతీకార సుంకాలను అమెరికా ఫెడరల్ కోర్టు నిలిపివేయడంతో నిన్నటి ట్రేడింగ్ సెషన్‌లో పరుగులు పెట్టిన సూచీలు నేడు తిరిగి నష్టాల్లోకి జారుకున్నాయి. తొలుత నష్టాల్లో ప్రారంభమైన సూచీలు ప్రస్తుతం ఫ్లాట్‌గా ట్రేడవుతున్నాయి. ఉదయం 9:25 గంటల సమయంలో సెన్సెక్స్ 27 పాయింట్ల లాభంతో 81,660 వద్ద ట్రేడవుతుండగా.. నిఫ్టీ 19 పాయింట్ల లాభంతో 24,852 వద్ద ఉన్నాయి. సెన్సెక్స్ 30 సూచీలో.. అదానీ పోర్ట్స్, మారుతీ సుజుకీ, ఎటర్నల్, సన్‌ఫార్మా, బజాజ్‌ఫిన్‌సర్వ్, అల్ట్రాటెక్ సిమెంట్, టాటా మోటార్స్, ఎల్‌అండ్‌టీ, నెస్లే ఇండియా షేర్లు లాభాల్లో కదలాడుతున్నాయి. ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా బ్యాంక్, టీసీఎస్, బజాజ్ ఫైనాన్స్, ఎంఅండ్‌ఎం, టాటా స్టీల్, ఐటీసీ షేర్లు నష్టాల్లో ట్రేడవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 63.84 డాలర్ల వద్ద.. బంగారం ఔన్సు 3,299 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. అమెరికా మార్కెట్లు గురువారం లాభాల్లో ముగిశాయి. ఎస్ అండ్ పీ 500.. 0.40 శాతం, నాస్‌డాక్ 0.39 శాతం, డోజోన్స్ 0.28 శాతం లాభపడ్డాయి. ఆసియాపసిఫిక్ మార్కెట్లు నేడు బలహీనంగా ట్రేడవుతున్నాయి. జపాన్ నిక్కీ 1.41 శాతం, హాంగ్‌సెంగ్ 1.49 శాతం, షాంఘై 0.28 శాతం నష్టంతో కదలాడుతున్నాయి. ఆస్ట్రేలియన్ ఏఎస్ఎక్స్ మాత్రం ఫ్లాట్‌గా ట్రేడవుతోంది. విదేశీ సంస్థాగత మదుపర్లు గురువారం నికరంగా రూ.884 కోట్ల విలువ చేసే షేర్లు కొనుగోలు చేయగా.. దేశీయ సంస్థాగత మదుపర్లు నికరంగా రూ.4,287 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు.

# జియో 5 కొత్త ప్లాన్‌లు ప్రత్యేక బెనిఫిట్‌తో..

**దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న క్లౌడ్ గేమింగ్ మార్కెట్ దృష్ట్యా రిలయన్స్ జియో ఒక పెద్ద అడుగు వేసింది. కంపెనీ ఐదు కొత్త ప్రీపెయి-డ్ ప్లాన్లను ప్రారంభించింది. వీటిలో ఉచితంగా జియోగేమ్స్ క్లౌడ్ ప్రయోజనాన్ని అందిస్తోంది. అంటే ఖరీదైన హార్డ్‌వేర్ లేకుండా యూజర్లు తమ మొబైల్, పీసీ, జియో సెట్-టాప్ బాక్స్‌లో కన్సోల్ లాంటి గేమ్స్‌ను ఆస్వాదించగలరు. ఈ ప్లాన్లు రూ.48 నుంచి ప్రారంభమవుతాయి.**

**ఏమిటీ జియోగేమ్స్ క్లౌడ్?**

ఇది క్లౌడ్ ఆధారిత గేమింగ్ సర్వీస్. దీని ద్వారా యూజర్లు గేమ్‌ను డౌన్లోడ్ చేయకుండా నేరుగా ఆన్‌లైన్‌లో ఆడవచ్చు. సాధారణంగా దీని సబ్ స్క్రిప్షన్ రూ.398. కానీ కొత్త ప్లాన్లలో ఈ సదుపాయాన్ని ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా జియో ఉచితంగా అందిస్తోంది. ఈ ఆఫర్ ప్రస్తుతం ప్రీపెయిడ్ వినియోగదారులకు మాత్రమే అందుబాటులో ఉంది. పోస్ట్ పెయిడ్, బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులకు ఇది అందుబాటులో లేదు.

**జియో కొత్త గేమింగ్ ప్లాన్స్ ఇవే..**

రూ.48 ప్లాన్: ఇది గేమింగ్ ప్రయత్నించాలనుకునే స్వల్పకాలిక వినియోగదారుల కోసం తీసుకొచ్చిన ప్లాన్. ఈ ప్లాన్ 10 ఎంబీ డేటా, జియోగేమ్స్ క్లౌడ్ యాక్సెస్ ను 3 రోజుల పాటు అందిస్తుంది.

రూ.98 ప్లాన్: ఈ ప్లాన్‌తో 7 రోజుల పాటు 10 ఎంబీ డేటా, గేమింగ్ యాక్సెస్ లభిస్తుంది. ఇది డేటా వోచర్, కాబట్టి దీనిని ఉపయోగించడానికి యాక్టివ్ బేస్ ప్లాన్ కలిగి ఉండటం అవసరం.

రూ.298 ప్లాన్: జియోగేమ్స్ క్లౌడ్ యాక్సెస్ తో పాటు 3 జీబీ డేటాను 28 రోజుల పాటు అందిస్తుంది. ఇది కూడా డేటా వోచర్. యాక్టివ్ ప్లాన్‌తో మాత్రమే ఉపయోగించవచ్చు.

రూ.495 ప్లాన్: రోజుకు 1.5 జీబీ డేటా, 5 జీబీ బోనస్ డేటా, అపరిమిత కాల్స్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లను 28 రోజుల పాటు అందిస్తుంది. జియోగేమ్స్ క్లౌడ్, జియోసినిమా (డిస్నీ+ హాట్‌స్టార్ మొబైల్), ఫ్యాన్‌కోడ్, జియోటీవీ, జియోఏఐక్లౌడ్ వంటి ఫీచర్లు కూడా ఇందులో ఉన్నాయి.

రూ.545 ప్లాన్: ఇది అత్యంత ప్రీమియం ప్లాన్. 2 జీబీ రోజువారీ డేటా, 5 జీబీ బోనస్ డేటా, అపరిమిత 5 జీ డేటా ఇందులో లభిస్తాయి. మిగతా ఫీచర్లన్నీ రూ.495 ప్లాన్ మాదిరిగానే ఉంటాయి.





## వరలక్ష్మి 'పోలీస్ కంప్లెయింట్'.. ఫస్ట్ లుక్ రిలీజ్

దక్షిణాదిలో డిఫరెంట్ పాత్రలు చేస్తూ గుర్తింపు తెచ్చుకున్న నటి వరలక్ష్మి శరత్ కుమార్. ఇప్పుడు తెలుగులో 'పోలీస్ కంప్లెయింట్' అనే మూవీ చేస్తోంది. ఇందులో వరలక్ష్మి ఫస్ట్ లుక్‌ని సూపర్‌స్టార్ కృష్ణ జన్మదినం సందర్భంగా విడుదల చేశారు. పవర్‌ఫుల్ పోలీస్‌గా ఈమె కనిపించనుంది. ఈ చిత్రంలో కృష్ణ మీద స్పెషల్ సాంగ్ షూట్ చేసామని, అది సినిమాకే మెయిన్ హైలెట్ అని నిర్మాతలు చెబుతున్నారు.

సింగపూర్ బాలకృష్ణ , మల్లెల ప్రభాకర్ సంయుక్తంగా నిర్మిస్తుండగా.. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ చంద్ర, కృష్ణ సాయి, రాగిణి ద్వివేది, రవిశంకర్, ఆదిత్య ఓం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ' అనే కాన్సెప్ట్ ఆధారంగా సినిమా తీశామని చెప్పిన దర్శకుడు సంజీవ్.. మనం చేసే ప్రతి చర్యకి ఫలితంగా అదే తిరిగి మనకే వస్తుందనే విషయాన్ని హారర్ థ్రిల్లర్ బ్యాక్‌డ్రాప్‌లో సరికొత్తగా చూపించబోతున్నామని అన్నారు.

## కన్నప్ప హార్డ్ డిస్క్ మాయం.. మనోజ్ మనుషులేనంటూ విష్ణు కామెంట్స్!



మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ కన్నప్ప హార్డ్ డిస్క్ మాయం కావడం టాలీవుడ్ చర్చనీయాంశంగా మారింది. ఇటీవలే ఈ విషయం బయటికి రావడంతో హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు కూడా నమోదు చేశారు. హార్డ్ డిస్క్ ఎవరూ మాయం చేశారన్న దానిపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే హార్డ్ డిస్క్ మాయంపై హీరో మంచు విష్ణు స్పందించారు. మూవీ ప్రమోషన్లలో భాగంగా చెన్నైలో నిర్వహించిన ఈవెంట్‌లో ఆయన మాట్లాడారు. ఈ విషయంపై మంచు విష్ణు సంచలన కామెంట్స్ చేశారు. మనోజ్ ఇంట్లో పనిచేసే రఘు, చరిత అనే వ్యక్తులే ఈ పని చేసి ఉంటారని మంచు విష్ణు తీవ్రమైన ఆరోపణలు చేశారు. అయితే వాళ్లుగా తీసుకున్నారా? ఇంకెవరైనా వారితో చేయించారా? అన్నది త్వరలోనే తెలుస్తుందని అన్నారు. హార్డ్ డిస్క్ బయటకు వెళ్లిన విషయమై పోలీసుల ద్వారా రిపోర్టర్‌కు తెలియడం వల్లే బయటకొచ్చిందని తెలిపారు. ఈ విషయాన్ని బయటకు చెప్పడం తనకు ఇష్టం లేదని మంచు విష్ణు వెల్లడించారు. కలర్ గ్రేడింగ్‌కు సంబంధించి ముంబయిలో రెడీ అయితే.. హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం ఉందని తెలిపారు. మొదటిసారి పంపిన కాపీ సరిగా రాకపోవడంతో ఆ కంపెనీ హార్డ్ డ్రైవ్‌లో ఆ సీన్స్‌ను పెట్టి కొరియర్ చేసిందని విష్ణు అన్నారు. మంచు విష్ణు మాట్లాడుతూ..' మేం రెండు అడ్రస్‌లు మెయింటెన్ చేస్తాం. అందులో ఆఫీస్ అడ్రస్ ఒకటి.. మరొకటి జీఎస్టీ రిజిస్ట్రార్ పేరిట ఉంటుంది. ఇది ఫిల్మ్ నగర్‌లోని నాన్న ఇంటి అడ్రస్. మా ముగ్గురికి సంబంధించిన ఏదైనా ఇక్కడికే వస్తుంది. అక్కడ ఉండే మా మేనేజర్లు ఎవరిది వాళ్లకు అందజేస్తారు. దాదాపు 15 ఏళ్లుగా ఇదే జరుగుతోంది. కానీ 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీకి కొరియర్ వచ్చిన సమయంలో రఘు అనే అతను అక్కడికి వచ్చాడు. ఆ ప్యాకెట్ తీసుకుని చరిత అనే అమ్మాయికి ఇచ్చాడు. ఇది జరిగి దాదాపు నెల రోజులైంది. నాకు తెలిసినప్పటికీ పోలీసులకు ఫిర్యాదు చేయాలనిపించలేదు. కొరియర్ తీసుకున్న వాళ్లు మనోజ్ ఇంట్లో పనిచేస్తున్నారో? లేదో నాకు తెలియదు. ఎవరైనా చెప్తే వచ్చి తీసుకెళ్లారా? వాళ్లే స్వయంగా తీసుకున్నారో తెలియాల్సి ఉంది' అని అన్నారు. కాగా.. కన్నప్ప మూవీ జూన్ 27న థియేటర్లలో విడుదల కానుంది.

## ముగ్గురు పెళ్లాలు.. నాలుగు జతల బట్టలు.. లాడెన్ గురించి తెలియని విషయాలివే!

**'పూరి మ్యూజింగ్స్' పేరుతో వివిధ అంశాలపై తన అభిప్రాయాన్ని పంచుకుంటున్న పూరి జగన్నాథ్ తాజాగా మోస్ట్ వాంటెడ్ అంటూ బిన్ లాడెన్ గురించి చెప్పారు.**

ఎన్నో వేల మంది చావులకు, సెప్టెంబరు 11 దాడులకు కారణమైన బిన్‌లాడెన్ చివరి పదేళ్లు కష్టాలు పడుతూ, భయపడుతూ బతికాడని దర్శకుడు పూరి జగన్నాథ్ అన్నారు. పూరి మ్యూజింగ్స్ పేరుతో ఆయన వివిధ అంశాలపై మాట్లాడుతున్న సంగతి తెలిసిందే. తాజాగా 'మోస్ట్ వాంటెడ్' అంటూ ఒసామా బిన్ లాడెన్ గురించి చాలా మందికి తెలియని కొన్ని విషయాలను పంచుకున్నారు.

''పాకిస్థాన్ స్వాత్ వ్యాలీలో స్పీడ్‌గా వెళ్తున్న కారును పోలీసులు ఆపారు. ఆ కారులో నీట్‌గా షేవ్ చేసుకున్న వ్యక్తి కూర్చొన్నాడు. ఆ కారు డ్రైవర్‌తో ఏదో మాట్లాడిన తర్వాత పోలీసులు కారును వదిలేశారు. అందులో ఉన్నది ఒసామా బిన్ లాడెన్ అన్న విషయం ఆ పోలీసులకు తెలియదు. అలా వదలకుండా ఉండి ఉంటే, లాడెన్ పదేళ్ల ముందే దొరికేవాడు. స్వాత్ వ్యాలీ, పెషావర్, హరిపూర్ తర్వాత అబోట్టాబాద్‌లో లాడెన్ సెటిల్ అయ్యాడు. అతను ఉన్న ఇంటి పేరు వజీరిస్థాన్ హవేలి. చాలా పకడ్బందీగా కట్టించాడు. చుట్టూ 1218 అడుగుల ఎత్తున్న గోడలతో మూడు అంతస్తుల ఇల్లు ఇది. తన ముగ్గురు పెళ్లాలు.. 8మంది పిల్లలు.. ఐదుగురు మనవళ్లతో అక్కడే ఉండేవాడు''

''బిన్ లాడెన్ తన చిన్న పెళ్లాంతో సెకండ్, థర్డ్ ఫ్లోర్‌లో ఎక్కువగా గడిపేవాడట. ఆ ఇంటికి టెలిఫోన్, ఇంటర్నెట్ కనెక్షన్ ఉండేది కాదు. చెత్త కూడా ఇంట్లోనే తగల బెట్టేవారు. తలుపు తీసేవారు కాదు. ఆ ఇంట్లో ఎవరు ఉంటున్నారో ఆ చుట్టు పక్కల వాళ్లకూ తెలియదు. బిన్ లాడెన్‌కు నాలుగు జతల బట్టలు, ఒక జాకెట్, రెండు స్వెటర్స్ మాత్రమే ఉండేవట. అలా 9ఏళ్లు అక్కడే అజ్ఞాతంలో బతికాడు. స్పై శాటిలైట్స్



నుంచి తప్పించుకోవడం కోసం బయటకు వచ్చినప్పుడల్లా కౌబాయ్ టోపీ పెట్టుకుని కాంపౌండ్‌లో తిరిగేవాడు. అతని రైట్ హ్యాండ్ అబు అహ్మద్ అల్ కువైటీ, అతని స్నేహితుడు అబ్రార్ మాత్రమే లాడెన్‌తో ఇతరులకు కమ్యూనికేషన్. అలాగే ఇంట్లో అవసరాలు వాళ్లే చూసుకునేవారు''

''లాడెన్ ఆ ఇంట్లో ఆవరణలోనే కూరగాయలు పండించుకుంటూ, కుందేళ్లు, కోళ్లను పెంచుకుంటూ బతికేవాడు. మనవళ్లతో మొక్కలు నాటించి, ఎవరిది పెద్దగా పెరిగితే వాళ్లకు బహుమతులు ఇస్తానని పోటీలు పెట్టేవాడట. సీక్రెట్ శాటిలైట్ డిష్ పెట్టుకుని టీవీ చూసేవాడట. తన గురించి ఒబామా ఏం మాట్లాడుతున్నాడో అనుక్షణం తెలుసుకునేవాడు. అతడు ఎక్కువగా టామ్ అండ్ జెర్రీ యానిమేటెడ్ సినిమాలు చూసేవాడు. స్వీట్స్, చాక్లెట్లు అంటే కూడా బాగా ఇష్టం. ఒకసారి తన భార్య డెలివరీ అవుతుంటే, తప్పనిసరి పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చింది. మారువేషంలో ఉన్న బిన్ లాడెన్.. డాక్టర్‌తో నా భార్య మూగ, చెవిటిది అని అబద్ధం చెప్పాడు. దాంతో ఆమెను ఒక్క ప్రశ్న కూడా వేయలేదు. ఆరోజు అమాయకంగా ఆస్పత్రిలో కూర్చొన్న బిన్‌లాడెన్‌ను ఎవరూ గుర్తు పట్టలేకపోయారు''



''అల్‌ఖైదా ఆపరేషన్స్ గురించి అతడు చెబుతుంటే.. కూతుళ్లు కాగితం మీద రాసేవారు. ఆ సమయంలో అల్‌ఖైదా బలహీనపడటం, ఆదరణ కోల్పోవడం గురించి బాధపడేవాడట. ఒకసారి అల్‌ఖైదా పేరు కూడా మార్చాలని ఆలోచించాడు. తన పిల్లలు, మనవళ్లు స్కూల్‌కు వెళ్లే అవకాశమే లేదు. దీంతో తానే పాఠాలు చెప్పేవాడు. ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండా కంప్యూటర్ ఉండేది. ఏదైనా సమాచారం చేరవేయాలంటే యూఎస్‌బీ డ్రైవ్స్ వాడేవాడు. ఏళ్ల తరబడి అదే ఇంట్లో అనుక్షణం భయపడుతూ బతికాడు. రోజంతా ఏం చేయాలో తోచక, అతని దగ్గరున్న వీడియో కెమెరాతో కోళ్లు, మొక్కలు, అప్పుడప్పుడు ఇంటిపై నుంచి వెళ్తున్న హెలికాప్టర్ దృశ్యాలను రికార్డు చేసేవాడు. ఎందుకంటే పక్కనే పాకిస్థాన్ ఆర్మీ కంటోన్మెంట్ ఉండేది. ఏ హెలికాప్టర్ వచ్చినా భయం వేసేదట''

''సీల్ టీమ్ ఇంట్లో చొరబడి అతడిని చంపిన తర్వాత అక్కడి కంప్యూటర్ నుంచి 4.70లక్షల ఫైల్స్ స్వాధీనం చేసుకున్నాయి. అందులో పోర్న్ వీడియోలు కూడా దొరికాయి. నాటి అమెరికా అధ్యక్షుడు ఒబామాను ఎలా చంపాలో వేసిన ప్లాన్స్ సీల్ టీమ్‌కు దొరికాయి. ఎన్నో వేల మంది చావులకు, సెప్టెంబరు 11 దాడులకు కారణమైన బిన్‌లాడెన్ చివరి పదేళ్లు కష్టాలు పడుతూ, భయపడుతూ బతికాడు. ఇవి బిన్ లాడెన్ గురించి తెలియని కొన్ని విషయాలు'' అంటూ పూరి జగన్నాథ్ ముగించారు.





## ఆ రూమర్స్‌కి చెక్.. ఫ్యామిలీ అంతా ఒకేచోట

స్వతహాగా తమిళ హీరో అయినప్పటికీ సూర్యకు తెలుగులోనూ మంచి ఫాలోయింగ్ ఉంది. రీసెంట్ టైంలో మాత్రం 'కంగువ', 'రెట్రో' చిత్రాలతో నిరాశపరిచాడు. ప్రస్తుతం వెంకీ అట్లూరితో ఓ మూవీ చేస్తున్నాడు. ఇవన్నీ పక్కనబెడితే కొన్నాళ్ల క్రితం సూర్య ఫ్యామిలీ గురించి అనుకోని కామెంట్స్ వినిపించాయి. కానీ ఇప్పుడు కూతురు గ్రాడ్యుయేషన్‌తో వాటన్నింటికీ చెక్ పెట్టినట్లయింది. తమిళంలో చాన్నాళ్లుగా సినిమాలు చేస్తున్న సూర్య.. తనతో పాటు కలిసి నటించిన జ్యోతికని 2006లో పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత ఈమె పూర్తిగా సినిమాలకు దూరమైంది. కూతురు దియా, కొడుకు దేవ్ కాస్త పెద్దోళ్లు అయిన తర్వాత నటిగా రీఎంట్రీ ఇచ్చింది. కొన్నాళ్ల క్రితం పిల్లల్ని పట్టుకుని జ్యోతిక.. ముంబైలోని తన తల్లిదండ్రుల దగ్గరకు వెళ్లిపోయింది. దీంతో లేనిపోని రూమర్స్ వచ్చాయి. జ్యోతిక ముంబైలో, సూర్య చెన్నైలో ఉంటున్నారని.. ఇరువురి మధ్య మనస్పర్థలు వచ్చాయనే కామెంట్స్ వినిపించాయి. కానీ తాజాగా కూతురు దియా గ్రాడ్యుయేషన్ వేడుకల్లో అటు సూర్య తల్లిదండ్రులు, ఇటు జ్యోతిక పేరెంట్స్ పాల్గొన్నారు. అందరూ ఒక్కచోట కనిపించడంతో ఇప్పటివరకు వినిపించిన మాటలన్నీ రూమర్స్ అని క్లారిటీ వచ్చేసింది. సూర్య కూతురు దియా వయసు ప్రస్తుతం 17 ఏళ్లు. ప్రస్తుతం ఇంటర్మీడియట్(ప్లస్ టూ) పూర్తి చేసింది. త్వరలో పై చదువుల కోసం విదేశాలకు వెళ్తుంది. మరి తల్లిదండ్రుల్లా దియా కూడా ఇండస్ట్రీలోకి వస్తుందా లేదా అనేది చూడాలి. ప్రస్తుతం చూడటానికి మాత్రం హీరోయిన్లకు ఏ మాత్రం తీసిపోనంత అందంగా ఉంది. మరి జ్యోతిక.. తన కూతురి గురించి ఏం ఆలోచిస్తుందో చూడాలి?

## ప్రాచీన కోటలో మర్డర్ రియాలిటీ గేమ్ షో.. కంటెస్టెంట్‌గా మంచు లక్ష్మి!

గతంలో కాఫీ విత్ కరణ్ షోతో ప్రముఖులను ఇంటర్వ్యూ చేసిన కరణ్ జోహార్ మరో రియాలిటీ షోతో ముందుకొస్తున్నారు. ప్రస్తుతం ఆయన హోస్ట్‌గా వస్తోన్న రియాలిటీ గేమ్ షో 'ది ట్రైటర్స్'. ఈ షోలో పలువురు సినీ ప్రముఖులు పాల్గొంటున్నారు. బాలీవుడ్‌తో పాటు దక్షిణాది నటులు కూడా ఉండడం ఈ షోపై మరింత ఆసక్తి పెంచుతోంది. ఈ నేపథ్యంలోనే ఈ షోలోనే పాల్గొనే వారి పేర్లను రివీల్ చేశారు. అంతేకాకుండా ఈ రియాలిటీ షో ట్రైలర్‌ను కూడా విడుదల చేశారు.

ఈ రియాలిటీ షోలో దాదాపు 20 మంది కంటెస్టెంట్లు పాల్గొననున్నారు. ఈ గేమ్ షోలో ఊహించని మలుపులు, హైవోల్టేజ్ డ్రామాతో పాటు ఉత్కంఠభరితమైన గేమ్ ఆడనున్నారు. ఈ షోను రాజస్థాన్‌లోని సూర్యగఢ్ ప్యాలెస్‌లో నిర్వహించనున్నారు. ఇందులో కరణ్ కుంద్రా, రాజ్ కుంద్రా, రఫ్తార్, జాస్మిన్ భాసిన్, జన్నత్ జుబైర్, ఉర్ఫీ జావేద్, అన్షు లా కపూర్, మహీప్ కపూర్, మంచు లక్ష్మి కూడా కంటెస్టెంట్‌గా అడుగు పెట్టనున్నారు. ఈ రియాలిటీ షో గెలిచిన వారికి భారీగా నగదు బహుమతి అందుకోనున్నారు.

అయితే గేమ్ షోను ఓటీటీ వేదికగా ప్రసారం చేయనున్నారు. అమెజాన్ ప్రైమ్ వేదికగా ప్రతి గురువారం కొత్త ఎపిసోడ్ స్ట్రీమింగ్ కానుంది. జూన్ 12 నుంచి తొలి ఎపిసోడ్ ప్రసారం కానుంది. ఈ రియాలిటీ గేమ్ షోను వెబ్ సిరీస్‌గా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. తాజాగా విడుదలైన ట్రైలర్ చూస్తే ఈ గేమ్ షోపై మరింత ఆసక్తిని పెంచుతోంది. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా ప్రతి గురువారం రాత్రి 8 గంటలకు కొత్త ఎపిసోడ్‌తో మీ ముందుకు రానుంది.









# పోరాడి ఓడిన గుజరాత్.. క్వాలిఫయర్-2కు ముంబయి

**గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబయి 20 పరుగుల తేడాతో విజయం సాధించింది.**

**చండీగఢ్:** ఐపీఎల్ 2025లో ముంబయి ఇండియన్స్ క్వాలిఫయర్ -2కి దూసుకెళ్లింది. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబయి 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆదివారం జరగనున్న క్వాలిఫయర్-2లో పంజాబ్, ముంబయి తలపడనున్నాయి. తొలుత బ్యాటింగ్ చేసిన హార్దిక్ సేన.. 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి పరుగులు చేసింది. ఈ భారీ లక్ష్యఛేదనలో గుజరాత్ పోరాడి ఓడింది. 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 208 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (80; 49 బంతుల్లో 10 ఫోర్లు, 1 సిక్స్), వాషింగ్టన్ సుందర్ (48; 24 బంతుల్లో 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) చెలరేగినా గుజరాత్‌కు ఓటమి తప్పలేదు. కమిందు మెండిస్ (20), రూథర్‌ఫోర్డ్ (24), రాహుల్ తెవాతియా (16*) షారుక్ ఖాన్ (13) పరుగులు చేశారు. చివర్లో ముంబయి బౌలర్లు పుంజుకొని పరుగులు కట్టడి చేయడంతో స్కోరు వేగం తగ్గి గుజరాత్ ఓటమి చవిచూసింది. ముంబయి బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ 2, బుమ్రా, రిచర్డ్ గ్లిసన్, శాంట్నర్, అశ్వని కుమార్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

**చెలరేగిన రోహిత్..**

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ముంబయి భారీ స్కోరు చేసింది. రోహిత్ శర్మ (81; 50 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) దంచికొట్టాడు. ఆరంభంలో రెండు లైఫ్‌లు అందుకున్న రోహిత్.. తర్వాత బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అతను 28 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. జానీ బెయిర్‌స్టో (47; 22 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) త్రుటిలో అర్ధ శతకం మిస్ చేసుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్ (33; 20 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), తిలక్ వర్మ (25; 11 బంతుల్లో 3 సిక్స్‌లు), హార్దిక్ పాండ్య (22*; 9 బంతుల్లో 3 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించారు. గుజరాత్ బౌలర్లలో సాయి కిశోర్ 2, ప్రసిద్ధ్ కృష్ణ 2, సిరాజ్ ఒక వికెట్ పడగొట్టారు.

ఈ మ్యాచ్‌లో నాలుగు సిక్స్‌లు కొట్టిన రోహిత్ ఐపీఎల్‌లో 300 సిక్స్‌లు పూర్తి చేసుకున్నాడు.ఐపీఎల్‌లో 300 సిక్స్‌లు సాధించిన తొలి భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. ప్రస్తుతం రోహిత్ ఖాతాలో 301 సిక్స్‌లున్నాయి.అంతేకాదు ఐపీఎల్‌లో 7 వేల పరుగుల మైలురాయి అందుకున్నాడు.



# ప్రధాని మోదీని కలిసిన ఐపీఎల్ సంచలనం వైభవ్ సూర్యవంశీ

**ప్రస్తుత ఐపీఎల్ సీజన్‌లో అద్భుత ఇన్నింగ్స్‌లు ఆడిన వైభవ్ సూర్యవంశీ, ప్రధాని నరేంద్ర మోదీని కలిసి ఆశీర్వాదాలు అందుకున్నాడు.**

రాజస్థాన్ రాయల్స్ తరపున ఈ ఐపీఎల్ సీజన్‌లో అరంగేట్రం చేసి, సంచలన ఇన్నింగ్స్‌లు ఆడిన వైభవ్ సూర్యవంశీ ప్రధాని నరేంద్ర మోదీని కలిశాడు. అనంతరం ఈ యువ క్రికెటర్ ప్రధాని కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం అందుకున్నాడు. 'నేను సంచలన యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీ, అతడి కుటుంబాన్ని పట్నా ఎయిర్‌పోర్టులో కలిశాను. యావత్ భారతావని అతడి క్రికెట్ నైపుణ్యాలను ప్రశంసిస్తోంది. అతడి భవిష్యత్తు గొప్పగా సాగాలని ఆకాంక్షిస్తున్నా..' అని ప్రధాని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు పెట్టారు.

ఇటీవలే ప్రధాని.. మన్‌కీ బాత్‌లో ఈ టీనేజ్ క్రికెటర్ ఐపీఎల్‌లో సాధించిన అద్భుతాల గురించి ప్రశంసించిన విషయం తెలిసిందే. 'ఐపీఎల్‌లో.. బిహార్ బిడ్డ వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ఆటతీరును చూశాను. అంత చిన్న వయసులో వైభవ్ గొప్ప రికార్డును సృష్టించాడు. ఈ ప్రదర్శన వెనుక అతడి కఠోర శ్రమ ఉంది' అని ప్రధాని అభినందించారు. అలాగే వైభవ్ చేసిన కృషి గురించి కూడా మాట్లాడారు. 'వైభవ్ తన ప్రతిభను మెరుగుపరుచుకోవడానికి వివిధ స్థాయిల్లో అనేక మ్యాచ్‌లు ఆడాడు. మీరు ఎంత ఎక్కువగా ఆడితే అంత ఎక్కువగా ప్రకాశిస్తారు. వీలైనంత ఎక్కువగా మ్యాచ్‌లు ఆడటం, పోటీల్లో పాల్గొనడం చాలా ముఖ్యం. మా ప్రభుత్వం ఎప్పుడూ యువ క్రీడాకారులకు అండగా ఉంటుంది' అని ప్రధాని మోదీ యువకుల్లో క్రీడాభిరుచిని ప్రోత్సహించేలా ప్రసంగించారు.

రాజస్థాన్ రాయల్స్ ఆటగాడైన వైభవ్ సూర్యవంశీ తన తొలి సీజన్‌లోనే అదరగొట్టాడు. కేవలం ఏడు మ్యాచుల్లోనే 252 పరుగులు చేసి ఔరా అనిపించాడు. ఇందులో ఓ రికార్డు సెంచరీ కూడా ఉంది. జైపుర్ వేదికగా గుజరాత్ టైటాన్స్ మీద కేవలం 35 బంతుల్లోనే శతకం సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగవంతమైన రెండో సెంచరీ బాదిన క్రికెటర్‌గా, అతి పిన్న వయస్కుడిగా కూడా రికార్డులు నెలకొల్పాడు. ఆ మ్యాచ్‌లో మొత్తంగా 38 బంతుల్లో 101 పరుగులు చేశాడు. కేవలం 14ఏళ్ల వయసులోనే వైభవ్ సూర్యవంశీ తన ఆటతీరులో ఎంతో పరిణతి ప్రదర్శించి అందరి ప్రశంసలూ అందుకున్నాడు.





# 'ఆర్సీబీ ఐపీఎల్ టైటిల్ గెలవాలంటే..!': రవిచంద్రన్ అశ్విన్ ఆసక్తికర వ్యాఖ్యలు



**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తొలిసారిగా ఐపీఎల్ టైటిల్ కైవసం చేసుకోవాలంటే.. ముంబయి ఇండియన్స్ ఎట్టి పరిస్థితుల్లోనూ ఫైనల్‌కు చేరుకోవద్దని టీమ్ ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు.**

ఐపీఎల్ 2025 దాదాపు ముగింపు దశకు చేరుకుంది. గురువారం ఏకపక్షంగా సాగిన క్వాలిఫయర్ 1లో పంజాబ్ కింగ్స్‌పై ఆర్సీబీ అలవోకగా గెలిచింది. ఈ విజయంతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఫైనల్‌కు చేరుకున్న మొదటి జట్టుగా నిలిచింది. పంజాబ్‌కింగ్స్, గుజరాత్ టైటాన్స్, ముంబయి ఇండియన్స్ ఈ మూడు జట్లలో ఏది తుది పోరులో బెంగళూరుతో పోటీపడుతుందో తేలాల్సి ఉంది. మరి కొన్ని గంటల్లో.. గుజరాత్ , ముంబయి మధ్య ఎలిమినేటర్ పోరు జరగనుంది. ఇందులో ఓడిన జట్టు ఐపీఎల్ నుంచి నిష్క్రమిస్తుంది. గెలిచిన వారు క్వాలిఫయర్ 1లో ఆర్సీబీ చేతిలో ఓడిపోయిన పంజాబ్ కింగ్స్‌తో జూన్ 1న తలపడతారు. క్వాలిఫయర్ 2లో గెలిచిన జట్టే బెంగళూరుతో జూన్ 3న ఫైనల్స్ ఆడాల్సి ఉంటుంది.

అయితే, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ టైటిల్ గెలవాలంటే ముంబయి ఎట్టి పరిస్థితుల్లోనూ ఫైనల్స్‌కు చేరుకోవద్దని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ముంబయి ఇండియన్స్ ఫైనల్‌కు చేరుకుంటే మాత్రం తొలిసారి టైటిల్ గెలవాలనే ఆర్సీబీ ఆశల్ని గల్లంతు చేసి.. ఆరోసారి ట్రోఫీ విన్నర్‌గా నిలుస్తుందని పేర్కొన్నాడు. 'ఒకవేళ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐపీఎల్ టైటిల్ గెలవాలంటే.. గుజరాత్ టైటాన్స్.. ముంబయి ఇండియన్స్‌పై విజయం సాధించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ ముంబయి ఫైనల్‌లో అడుగు పెట్టకుండా ఉంటేనే.. ఆర్సీబీ విజయం ఖాయమయ్యే అవకాశం ఉంటుంది. బెంగళూరు జట్టు బలంగా కనిపిస్తున్నప్పటికీ.. క్రికెట్‌లో ఏదైనా జరగొచ్చు. నేనే ఆర్సీబీ జట్టు ఆటగాడినైతే.. గుజరాత్ టైటాన్స్‌తో ఫైనల్ ఆడాలని కోరుకుంటాను' అని అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో చెప్పుకొచ్చాడు. అలాగే విరాట్ కోహ్లీ గురించి కూడా అశ్విన్ మాట్లాడాడు. 'చూస్తుంటే ఇది ఆర్సీబీ సంవత్సరంలా కనిపిస్తోంది. గొప్ప భారత టెస్టు కెప్టెన్లలో ఒకరైన విరాట్ కోహ్లీ బెంగళూరు విజయాల్లో కీలకపాత్ర పోషిస్తున్నాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఒకవేళ ఫైనల్‌లో ఛేజింగ్ చేసే అవకాశం వస్తే.. ఆ పరిస్థితులను తమకు అనుకూలంగా ఎలా మార్చుకోవాలో విరాట్ కోహ్లీకి బాగా తెలుసు' అని రవిచంద్రన్ అశ్విన్ తనదైన విశ్లేషణ చేశాడు.

# ఐపీఎల్ ఫైనల్‌లో విరాట్ కోహ్లీ కీలక ఇన్నింగ్స్ ఆడతాడు: ఏబీ డివిలియర్స్

పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బ్యాటర్‌గా కోహ్లీ విఫలమయ్యాడు. కానీ ఫైనల్‌లో అతడు కీలక ఇన్నింగ్స్ ఆడతాడని ఏబీ డివిలియర్స్ ధీమా వ్యక్తంచేశాడు.

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా.. పంజాబ్ కింగ్స్ , రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ల మధ్య గురువారం క్వాలిఫయర్ 1 మ్యాచ్ జరిగింది. ఏకపక్షంగా సాగిన ఈ లో స్కోరింగ్ గేమ్‌లో ఎనిమిది వికెట్ల తేడాతో బెంగళూరు విజయం సాధించింది. ఈ సీజన్‌లో ఫైనల్‌కు దూసుకెళ్లిన మొదటి జట్టుగా నిలిచింది. తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్ 14.1 ఓవర్లలో కేవలం 101 పరుగులకే ఆలౌటైంది. తర్వాత ఛేదన ప్రారంభించిన ఆర్సీబీ 10 ఓవర్లకు 2 వికెట్లు నష్టపోయి 106 పరుగులు చేసింది. కానీ ఈ మ్యాచ్‌లో కోహ్లీ తన బ్యాట్‌తో (12) విఫలమయ్యాడు. ఇది అభిమానులను కాస్త నిరాశపరిచింది. అయితే ఆర్సీబీ మాజీ ఆటగాడు ఏబీ డివిలియర్స్ మాత్రం విరాట్‌కు మద్దతుగా నిలిచాడు. ఫైనల్స్‌లో ఈ ఛేజ్ మాస్టర్ తప్పకుండా కీలక ఇన్నింగ్స్ ఆడతాడని జోస్యం చెప్పాడు. అలాగే ఆర్సీబీ తప్పకుండా ఐపీఎల్ ట్రోఫీని సొంతం చేసుకుంటుందని ధీమా వ్యక్తంచేశాడు. 'విరాట్ కోహ్లీ ఈ మ్యాచ్‌లో పెద్దగా పరుగులు చేయలేకపోయాడు. అయినా ఇబ్బందేమీ లేదు. అతడు కచ్చితంగా ఫైనల్ మ్యాచ్‌లో కీలకమైన ఇన్నింగ్స్ ఆడతాడు. ఈ విషయంలో నాకు ఎటువంటి అనుమానమూ లేదు. అతడు ఆడుతుంటే చూడ్డానికి నేనెంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను' అని ఏబీ డివిలియర్స్ అన్నాడు. అలాగే ఆర్సీబీ జట్టు గురించి కూడా అతడు తన అభిప్రాయాలను పంచుకున్నాడు. 'నాకు తెలిసి 2011లో ఐపీఎల్ టైటిల్ గెలిచేందుకు అద్భుతమైన అవకాశం ఉండేది. అలాగే అందరూ 2016 సీజన్ గురించి కూడా మాట్లాడుతున్నారు. కానీ గతాన్ని మరిచిపోవాలి. ప్రస్తుతం ఆర్సీబీ ఎక్కడ ఉంది. 2025లో ఫైనల్‌కు చేరుకుంది. టైటిల్‌ను కైవసం చేసుకునేందుకు చాలా చేరువలో ఉంది. జూన్ 3న జరగనున్న తుదిపోరులో ఆర్సీబీ తప్పకుండా విజయం సాధిస్తుంది. ప్రపంచస్థాయి ఆటగాడైన జోష్ హేజిల్‌వుడ్ రాకతో ఆర్సీబీ బౌలింగ్ యూనిట్ బలంగా మారింది. అతడు మాకు కీలకమైన ఆటగాడు. అలాగే భువనేశ్వర్ కుమార్ కూడా చక్కగా బౌలింగ్ చేస్తున్నాడు' అని డివిలియర్స్ విశ్లేషించాడు.

# చెలరేగిన రోహిత్.. GT టార్గెట్ 229



**ఐపీఎల్‌లో భాగంగా గుజరాత్‌తో జరుగుతోన్న ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబయి ఇన్నింగ్స్ ముగిసింది.**

**ఛండీగఢ్:** ఐపీఎల్ 2025 ప్లే ఆఫ్స్‌లో భాగంగా గుజరాత్ టైటాన్స్ తో జరుగుతున్న ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబయి ఇండియన్స్ భారీ స్కోరు చేసింది. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగులు చేసింది. రోహిత్ శర్మ (81; 50 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) దంచికొట్టాడు. జానీ బెయిర్‌స్టో (47; 22 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) త్రుటిలో అర్ధ శతకం మిస్ చేసుకున్నాడు. సూర్యకుమార్ యాదవ్ (33; 20 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లు), తిలక్ వర్మ (25; 11 బంతుల్లో 3 సిక్స్‌లు), హార్దిక్ పాండ్య (22*; 9 బంతుల్లో 3 సిక్స్‌లు) క్రీజులో ఉన్నంతసేపు మెరుపులు మెరిపించారు. గుజరాత్ బౌలర్లలో సాయి కిశోర్ 2, ప్రసిద్ధ్ కృష్ణ 2, సిరాజ్ ఒక వికెట్ పడగొట్టారు.

**రోహిత్ 300 సిక్స్‌లు**

ఈ మ్యాచ్‌లో రోహిత్ నాలుగు సిక్స్‌లు కొట్టిన రోహిత్ ఐపీఎల్‌లో 300 సిక్స్‌లు పూర్తి చేసుకున్నాడు. ఐపీఎల్‌లో 300 సిక్స్‌లు సాధించిన తొలి భారత ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. అంతేకాదు ఐపీఎల్‌లో 7 వేల పరుగుల మైలురాయి అందుకున్నాడు. ప్రస్తుతం రోహిత్ ఖాతాలో 301 సిక్స్‌లున్నాయి. ఆరంభంలో రెండు లైఫ్‌లు అందుకున్న రోహిత్.. తర్వాత బౌండరీలతో విరుచుకుపడ్డాడు. అతను 28 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. *